


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
3
గురువారం 2 మే 2024





వార్ వన్‌సైడ్ !

కూటమికి కలిసి వస్తున్న మూడు పార్టీల సహకారం





- కూటమి వర్సెస్ వైసీపీ ఎవరి వ్యూహాలు వారివి.. జిల్లాలో పదునెక్కిన రాజకీయం
- కొద్ది రోజుల క్రితం వైసీపీకి అనుకూలంగా జిల్లాలో పందేలు.. ఇప్పుడంతా గప్‌చుప్
- సంక్షేమం.. అభివృద్ధి బాటలో కూటమి
- డబ్బులతో వైసీపీ ఎత్తుగడలు

జిల్లాలో రాజకీయాలు పదునెక్కాయి. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులంతా నువ్వా నేనా అంటూ ప్రజాక్షేత్రంలో పోటీ పడుతున్నారు. నరసాపురం పార్లమెంట్ పరిధిలోని, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో ప్రచారం హోరెత్తుతోంది. టీడీపీ-జనసేన-బీజేపీ పార్టీల ఎన్డీఏ కూటమి ఇప్పటికే మేనిఫెస్టో విడుదల చేసి తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామో ప్రజలకు వివరిస్తూ దూసుకువెళుతోంది. స్థానిక సమస్యలను ప్రస్తావిస్తోంది. వార్ వన్‌సైడ్ అంటూ హోరెత్తిస్తోంది. ఈ కూటమి మేనిఫెస్టో ముందు వైసీపీ మేనిఫెస్టో తేలిపోవడంతో ఆ పార్టీ అభ్యర్థులకు, కేడర్‌కు ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఐదేళ్లు అరాచక, విధ్వంసక పాలనతోపాటు స్థానికంగా అభివృద్ధి లేకపోవడంతో జనంలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మొన్నటి వరకు అధికార పార్టీకి అనుకూలంగా పందేలు సాగగా, ఇప్పుడు అంతా గప్‌చుప్‌గా వుంది. ఎవరూ ఆ వైపు మాట్లాడడం లేదు. ఇదే ఆ పార్టీ అభ్యర్థులను కలవరపరుస్తోంది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

• భీమవరంలో ఒక్కటైన కూటమి

భీమవరంలో వైసీపీ వ్యూహం తొలి నుంచి బెడిసికొడుతోంది. పవన్ కల్యాణ్ భీమవరంలో పోటీ చేస్తారంటూ ఇక్కడ అంతా భావించారు. అదే జరిగితే వైసీపీయే ఆర్థిక భారం సహా అన్ని రకాల సహకారం అందిస్తుందని స్థానిక పార్టీ నేతలు ఊహించారు. వైసీపీ అభ్యర్థి అదే ధీమాలో ఉన్నారు. గతంలో పవన్ కల్యాణ్‌ను ఢీకొట్టాం. ఇప్పుడు అదే తరహాలో నెగ్గుకు రాగలమన్న ధీమా వైసీపీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్‌లో ఉండేది. ఇప్పుడు అనూహ్యంగా జనసేన నుంచి అంజిబాబు రంగంలోకి దిగారు. అంజిబాబుకు పదేళ్లపాటు భీమవరం నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా వ్యవహరించారు. అభివృద్ధి పనులు నిర్వహించారు. ఎన్నికల అనంతరం రాజకీయాలకు అతీతంగా సేవలందిస్తూ వచ్చారు. కూటమి నాయకులంతా అక్కడ ఒక్కటయ్యారు. అన్ని సామాజిక వర్గాల్లోనూ అంజిబాబు మంచివాడన్న అభిప్రాయం ఉంది. టీడీపీకి బీసీలు అండగా ఉంటున్నారు. జనసేనకు మరో బలమైన సామాజిక వర్గం అండగా ఉంది. రెండూ కలిస్తే భారీ గెలుపు తమదేనన్న వ్యూహంతో కూటమి అడుగులు వేస్తోంది. అధికార పార్టీ ఎంపీ అభ్యర్థి సామాజిక వర్గాన్ని తమ వైపు తిప్పుకునేలా వైసీపీ భీమవరంలో పావులు కదుపుతోంది. గ్లాసుకు ఓటేస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని చెబుతూ, మరోవైపు సొమ్ములను ఎరవేసే వ్యూహాలను అమలు చేస్తున్నారు. వారు ఏం చేసినా గెలుపు తమదేనన్న ధీమాతో అంజిబాబు ముందుకు సాగుతున్నారు.

అభివృద్ధి వర్సెస్ అవినీతి

• ఆచంటలో ఇద్దరు మాజీ మంత్రులు

రాజకీయాల్లో ఆరితేరిన ఇద్దరు మాజీ మంత్రులు ఆచంటలో తలపడుతున్నారు. వారే కూటమి నుంచి టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, వైసీపీ నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే రంగనాధరాజు. వైసీపీ కేడర్‌లో నెలకొన్న అసంతృప్తి కూటమికి కలిసి వస్తుందని వీరు నమ్మకంతో ఉన్నాయి. అధికార పార్టీ వలంటీర్ల సేవలను వినియోగించుకుంటోంది. సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే వైసీపీని నెగ్గించాలంటూ వారితో ప్రచారం చేయిస్తోంది. కార్యకర్తలకంటే వలంటీర్లపైనే ఆచంటలో వైసీపీ ఆధారపడుతోంది. టీడీపీ అభ్యర్థి పితానికి ఈసారి ఎన్నికల్లో జనసేన ఓటు బ్యాంకు కలిసి వస్తోంది. గత ఎన్నికల్లో దూరమైన వర్గాలను కూడగట్టుకుంటున్నారు. ప్రధానంగా ఆచంటలో బీసీ సామాజిక వర్గాలు తమవైపు ఉండేలా ప్రణాళిక చేసుకుని ముందడుగు వేస్తున్నారు. గెలుపు పక్కా అంటూ కూటమి అక్కడ ధృడనమ్మకంతో ఉంది. గత ఐదేళ్లలో ఆచంటలో జరిగిన భూముల కొనుగోలు అక్రమాలు, ఇసుక దందా, అవినీతి తదితర అంశాలను కూటమి ప్రజల్లోకి తీసుకువెళుతోంది. సంక్షేమంతో కూడిన అభివృద్ధిని చేస్తామంటూ హామీ ఇస్తోంది.

తణుకులో మంత్రి కారుమూరి నాగేశ్వర రావు, టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ రెండోసారి ఢీకొడుతున్నారు. ఈ ఐదేళ్లు సంక్షేమ పథకాలు అమలు చేశామంటూ మంత్రి చెబుతుంటే, ఆ సంక్షేమం ముసుగులో సాగిన అవినీతిని ఆరిమిల్లి ఎండగడుతున్నారు. అంతేకాదు.. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ఓటర్లను ఆలోచింపజేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో కాపులు, బీసీలతోపాటు, దళిత సామాజిక వర్గాల ఓటర్లు అధికంగా ఉన్నారు. టీడీపీ బీసీలతోపాటు, జనసేన, బీజేపీ ఓటు బ్యాంకు తమకు కలిసి వస్తుందన్న ధీమాతో ఉంది.

• పాలకొల్లు ఎవరికి సొంతం

పాలకొల్లులో వైసీపీ తొలి నుంచి పిల్లి మొగ్గలు వేస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లను మారుస్తోంది. చివరి దశలో గుడాల గోపీని రంగంలోకి దింపింది. అదే సామాజిక వర్గంపై ఇప్పుడు ఆ పార్టీ ఆశలు పెట్టుకుంది. మరోవైపు మూడోసారి విజయం సాధించేందుకు టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు వ్యూహాలు పన్నుతున్నారు. నిత్యం ప్రజల్లో ఉంటున్నారు. ఐదేళ్లపాటు ప్రజా సమస్య లపై పోరాడుతూ వచ్చారు. వైసీపీ హయాంలో నియోజ కవర్గంలో అభివృద్ధి లేకపోవడం, టిడ్కో ఇళ్లు మంజూరు చేయకపోవడం వంటి అంశాలను జనంలోకి తీసుకువెళ తున్నారు. కులాలకు అతీతంగా మద్దతును కూడగట్టు కునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలకు నిత్యం అందుబా టులో ఉండడం ఈసారి ఆయనకు కలసి వచ్చే అంశంగా పార్టీ శ్రేణులు విశ్వసిస్తున్నాయి.

• నర్సాపురంలో కలిసిన చేతులు

నర్సాపురంలో కాపు, మత్స్య కార సామాజిక వర్గం ఓటర్లు అధికం. ఆ రెండు ఏకపక్షమైతే కూటమి అభ్యర్థి నాయకర్ గెలుపు నల్లేరుపై నడకగా అంతా భావిస్తున్నా రు. కూటమికి అండగా మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారా యుడు ఇప్పుడు క్రియాశీలకమయ్యారు. వీరితోపాటు తెలుగుదేశం ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు కూటమికి గెలుపు కోసం కృషి చేస్తున్నారు. ఇవన్నీ కూటమికి అనుకూలంగా ఉన్న పరిణామాలే. కూటమి అభ్యర్థికి అండగా ఉన్న రెండు సామాజిక వర్గాల ఓట్లను చీల్చే ప్రణాళికతో అధికార పార్టీ ఉంది. ఆ దిశగానే వైసీపీ అభ్యర్థి ముదునూరి ప్రసాద్‌రాజు పావులు కదుపుతున్నారు. అర్థ బలంతోనైనా ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాల్లో వైసీపీ నిమగ్నమైంది. నియోజకవర్గంలో ఐదేళ్లపాటు అభివృద్ధి లేకపోవడంతో అక్కడ వైసీపీకి మైనస్‌గా మారింది.

• ఉండిపైనే అందరిచూపు

ఉండి నియోజకవర్గంపైనే ఇప్పుడు అందరిచూపు ఉంది. కూటమి పొత్తులు, సర్దుబాటులో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు బరిలో దిగారు. దీంతో అక్కడ రాజకీయాలపై అందరి దృష్టిపడింది. వైసీపీ రాష్ట్ర నాయకత్వం ఉండిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఓ వైపు టీడీపీ అభ్యర్థి రఘురామకు ఎమ్మెల్యే రామరాజు సంపూర్ణ మద్దతు ప్రకటించి ప్రచారం చేస్తున్నారు. జనసేన నాయకులంతా కూటమి గెలుపునకు కృషి చేస్తున్నారు. అయితే అక్కడ వైసీపీ నుంచి పీవీఎల్ నరసింహరాజు, ఇండియన్ ఫార్వర్డ్ బ్లాక్ నుంచి శివరామరాజు పోటీ పడుతున్నారు. ఇప్పటి వరకు టీడీపీలో ఉన్న శివ ఆ పార్టీ ఓటు బ్యాంకును చీలుస్తారన్న ధీమాతోనే వైసీపీ ఉంది. మరోవైపు తమ పార్టీ అభ్యర్థిని వైసీపీ గాలికొదిలేసిందంటూ చర్చ సాగుతోంది. ఆ పార్టీ ఎత్తులను తిప్పికొట్టేలా రఘురామ ప్రచారం సాగి స్తున్నారు. ఉండిలో ఇద్దరు వైసీపీ అభ్యర్థులున్నారని, ఒకరు అధికారికమైతే, మరొకరు అనధికారికం అంటూ పీవీఎల్, శివలపై విరుచుకు పడుతున్నారు. ఇద్దరిలో ఎవ రికి వేసినా అది వైసీపీకి వేసినట్టే ప్రచారం చేస్తున్నారు. తనను గెలిపిస్తే స్థానిక సమస్యలతోపాటు, సంక్షేమంతో కూడిన అభివృద్ధిని సాగిస్తామంటూ ప్రచారం చేస్తున్నారు.

• తాడేపల్లిగూడెంలో రసవత్తరం

తాడేపల్లిగూడెంలో పోరు రసవత్తరంగా సాగుతోంది. అభ్యర్థులు మాటలతో రాజకీయాన్ని వేడెక్కిస్తున్నారు. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రచారంలో జనసేన అభ్యర్థి బొలిశెట్టిని టార్గెట్ చేస్తున్నారు. కూటమిని గెలిపిస్తే రౌడీయిజం పెరిగిపోతుందంటూ ప్రచారం చేస్తున్నారు. దీనికి దీటుగా కూటమి నాయకులు స్పందిస్తూ టీడీపీ హయాంలో రౌడీయిజం సాగిందా..? అభి వృద్ధి సాగిందా..? అంటూ నిల దీస్తున్నారు. ఐదేళ్లలో నియోజక వర్గంలో సాగిన దందాలు, అక్రమ వసూళ్లు, అవినీతి పర్వాన్ని బొలిశెట్టికి అండగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వలవల బాబ్జి ఎండగడుతున్నారు. మళ్లీ వైసీపీకి అధికారమిస్తే ఇప్పుడు కొండంతవున్న అవినీతి కొన్ని రెట్లు పెరిగిపోతుందంటూ వైసీపీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణపై గురిపెట్టి ప్రజల్లోకి వెళుతున్నారు. మరోవైపు గతంలో వైసీపీ వెంట నడిచిన నాయకులు అనేక మంది ఇప్పుడు కూటమి పక్షాన చేరిపోయారు. ఇవన్నీ కూటమిని గెలిపిస్తాయన్న ధీమాతో నాయకులు ముందుకు సాగుతున్నారు.

- స్వోత్కర్ష.. పరనింద.. అన్ని సభల్లోనూ సీఎంది అదే తీరు
- ఈ మాత్రం దానికి ఇంత ఎండలో రావాలా ? అంటూ శ్రేణుల రుసరుస
- రోడ్డుపై సభతో.. బారికేడ్ల ఏర్పాటు.. షాపుల మూసివేత.. జనం పాట్లు

మండే ఎండలో జగన్ మంటలు

ఏలూరులో మధ్యాహ్నం సీఎం సభ

ఎండతో మలమలమాడిన జనం



ఎండ వేడికి తట్టుకోలేక ఇలా పెట్రోలుబంకులో నీడకు చేరిన మహిళలు

ఏలూరు/ఏలూరు రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'రోజూ చెప్పే మాటలే ఇక్కడా చెబుతున్నాడు. ఎండలో నిలబడి వినే బదులు ఇంటికి వెళ్లి టీవీ చూసుకోవచ్చు పద' అంటూ చాలా మంది సీఎం జగన్ సభ నుంచి తిరుగుముఖం పట్టారు. ఏలూరులో బుధవారం 36 నిమిషాలపాటు సాగిన సీఎం జగన్ ప్రసంగం ప్రజలను మెప్పించలేకపోయింది. 'సిద్ధమా ఏలూరు.. మధ్యాహ్నం ఎర్రటి ఎండలో కూడా మీ బిడ్డను ఆశీర్వదించటానికి ఇక్కడకు వచ్చిన మీకు అందరికి కృతజ్ఞతలు' అంటూ ప్రసంగం ప్రారంభం కాగానే చాలా మంది మహిళలు, యువకులు సభాస్థలి నుంచి వెనక్కి వెళ్లడం ప్రారంభించారు. ఏలూరులో బుధవారం జరిగిన సీఎం జగన్ ప్రచార సభ అతి సామాన్యులను, వైసీపీ శ్రేణుల్లో నిరాశ మిగిల్చింది. ఆయన రోజూ చెప్పే మాటలే ఇక్కడ చెప్పడం, ఉపన్యాసానికే పరిమి తమవడంతోపాటు ప్రభుత్వ విజయాలకంటే చంద్రబాబుపై విమర్శలకే అధిక సమయం తీసుకోవడంతో ప్రజలు, వైసీపీ శ్రేణులు పెదవి విరిచారు. సీఎం సభ కోసం ఎంపిక చేసిన ప్రాంతం ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఏ రాజకీయ పార్టీ సభ జరిగినా నాలుగురోడ్ల కూడలిలో ఏర్పాటు చేయడం పరిపాటి. ఆ కూడలి విశాలంగా ఉంటుంది. నాలుగు వైపుల వున్న ప్రజలు మాట్లాడేవారు కనిపిస్తూ అనుకూలంగా ఉండేది. అయితే బుధవారం అందుకు భిన్నంగా ఫైర్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో కోర్టు సెంటర్ రోడ్డులో ప్రసంగం చేయడంతో గందరగోళం ఏర్పడింది. అలవాటు ప్రకారం చాలా మంది రోడ్డు మధ్యనే నిలబడిపోయారు. రోడ్డు డివైడర్‌కు ఒక వైపు పూర్తిగా సీఎం కాన్వాయ్ వాహనాలకు రిజర్వు చేయడంతో సభ ఏర్పాటు చేసిన రోడ్డుకు సగానికి కూడా జనం రాలేదు. ఫైర్ స్టేషన్‌కు కిలోమీటరు దూరంలోనే వాహనాలన్ని ఆపేయడంతో జనం విసుగు ప్రదర్శించారు. షాపులు మొత్తం మూయించడంతో వారంతా ఆవేదనకు గురయ్యారు. ఫైర్‌స్టేషన్ నుంచి రాకపోకలు నిషేధించడంతో బస్సుల కోసం ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పాతబస్టాండ్ వద్దే రెండు గంటలు నిలిపివేయడంతో బస్సులు లేక ప్రయాణికులు వేచి ఉన్నారు. ఎర్రటి ఎండలో తమను అనవసరంగా నడిపిస్తున్నారంటూ పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ ఏర్పాటుపై వైసీపీ శ్రేణులే అసహనం వ్యక్తం చేశారు. దీనికితోడు మధ్యాహ్నం విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ఆ ప్రాంత వాసులు అల్లాడిపోయారు. ఇక ఏలూరు ఫైర్‌స్టేషన్ మీదుగా వెళ్లాల్సిన వాహనాల ఎప్పుడూ లేనివిధంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు దారి మళ్లించారు.



మాట్లాడుతున్న జగన్

ఆకట్టుకోని సీఎం ప్రసంగం

సీఎం జగన్ ప్రసంగం జనాన్ని మెప్పించలేకపోయింది. ఆయన మాట్లాడిన ప్రసంగం మొత్తం బటన్ నొక్కడం, వివిధ సంక్షేమ పథకాల పేర్లు పదేపదే వల్లె వేయటానికే సరిపెట్టారు. కనీసం రాష్ట్రంలో ఫలానా అభివృద్ధి కార్యక్రమం చేశామని ఒక్కటి చెప్పలేదు. రాబోయే రోజుల్లో చేస్తామని చెప్పడానికి ఒక్క అభివృద్ధి పేరు తలచలేదు. ఎంతసేపు మీ బిడ్డ బిడ్డ అంటూ బటన్ నొక్కుడు పథకాలతోనే ప్రసంగాన్ని నింపివేశారు. అవకాశం దొరికినప్పుడల్లా చంద్రబాబును విమర్శించటానికి ప్రయత్నించారు. జగన్ మాట్లాడుతూ వచ్చే రెండు వారాల్లో కురుక్షేత్ర సంగ్రామం మొదలవుతుందని, పేదలకు చంద్రబాబు మోసాలకు యుద్ధం ప్రారంభమైందన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల సీఎంగా ఉండి రాష్ట్రానికి చేసిన అభివృద్ధి చెప్పుకోవడానికి ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో క్లాస్‌వార్ జరుగుతోందన్నారు. టీడీపీ ఎన్నికల ప్రణాళిక నమ్మి మోస పోవద్దని, అది చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు ఆపేస్తాడన్నారు. వైసీపీ పథకాలు ఉండాలో వద్దో, అందాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆళ్ల నాని, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను ప్రజలకు పరిచయం చేసి గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు జనసమీకరణలో కూడా అనుకున్న స్థాయిలో ప్రయత్నాలు చేయలేదు.

రేపు సీఎం జగన్ నరసాపురం రాక

నరసాపురం : సీఎం జగన్ శుక్రవారం ఉదయం పది గంటలకు నరసాపురంలో ఎన్నికల ప్రచార సభ నిర్వహించనున్నారు. టేలర్ హైస్కూల్ మైదానంలో హెలిక్టాపర్ దిగి అక్కడ నుంచి నేరుగా మెయిన్‌రోడ్‌కు చేరుకుని మాట్లాడతారు.

కొందరికే ఇంటికి

64 వేలకు, 38 వేల మందికే పెన్షన్ పంపిణీ పూర్తి

భీమవరం, మే 1(ఆంధ్రజ్యోతి):జిల్లాలో మే నెలకు సంబంధించి పెన్షన్ పంపిణీ ప్రారంభమైంది. దివ్యాంగులు, నడిచే పరిస్థితి లేని వారికి ఇంటికి వెళ్లి పెన్షన్ అందిస్తున్నారు. 2.34 లక్షల మంది పెన్షన్‌దారులకు 64 వేల మంది దివ్యాంగులు, అనారోగ్య బాధితులున్నారు. అంటే 27 శాతం మందికి ఇంటికి వెళ్లి పెన్షన్ ఇస్తున్నారు. 63 శాతం మంది పెన్షన్‌దారులకు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. తొలిరోజు కొద్ది మందికే జమయ్యాయి. డబ్బులు పడ్డాయా లేదా అన్నది తెలుసుకోవాలన్నా, సొమ్ములు తీసుకోవాలన్నా బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాలి. 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా వారు వెళ్లలేని పరిస్థితి ప్రభుత్వం పట్టించుకోలేదు. దివ్యాంగులకు, అనారోగ్య బాధితులకు మాత్రం జిల్లాలో బుధవారం 38 వేల మంది పెన్షన్ పంపిణీ పూర్తిచేశారు. మిగిలిన వారికి గురువారం అందజేయనున్నారు. బ్యాంకు ఖాతాల్లో మాత్రం ఎంతమందకి పడ్డాయనే విషయం అధికారుల వద్ద స్పష్టత లేదు.

వయోవృద్ధులకు 4 నుంచి ఇంటి వద్దే ఓటింగ్

సార్వత్రిక ఎన్నికల్లో వయోవృద్ధులకు ఇంటి వద్దనే ఓటు వేయించే ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కావాలి. అయితే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు ఒకటో తేదీ వరకు గడువు పెంచడంతో బ్యాలెట్ ప్రింటింగ్ జరగాల్సి ఉంది. వయోవృద్ధులకు ఓటింగ్ రాష్ట్రవ్యాప్తంగా రెండో తేదీ నుంచి ప్రారంభమవుతోంది. అయితే జిల్లాలో నాలుగో తేదీ నుంచి ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ వివరాలను గురువారం అధికారులు ప్రకటించనున్నారు. ఓటింగ్‌కు సంబంధించి ఏడు నియోజకవర్గాలకు అధికారులకు ఆదేశాలు జారీచేశారు. వయోవృద్ధుల ఓట్లపైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లపైన ఇప్పటికే వైసీపీ నేతలు ప్రత్యేక దృష్టి పెట్టి వారికి అనుకూలంగా ఓట్లు వేసేలా ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

జగన్ ఎంతకైనా తెగిస్తాడు

- మళ్లీ అధికారం ఇస్తే ఆస్తులు స్వాహా చేస్తాడు : ఉండి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామకృష్ణరాజు

ఆకివీడు, మే 1 : 'సీఎం జగన్ చట్టాలను చుట్టాలుగా చేసుకుని ఆర్థిక అరాచకానికి పాల్పడ్డాడు. తన స్వార్థం కోసం ఎంతటికైనా దిగజారుడుతాడు. ఆయనకు మళ్లీ అధికారం అప్పగిస్తే ప్రజల ఆస్తులను స్వాహా చేస్తారు. అందుకే ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను తీసుకు వచ్చారు. ప్రజల ఆస్తి పత్రాలతోపాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలపైన తన ఫొటోలను ముద్రించుకొనే పిచ్చి జగన్‌రెడ్డి పాల్పడుతు న్నారు. ఇలాంటి వ్యక్తిని రాజకీయ చిత్రపటం నుంచి కనపడకుండా చేయాలి. వలంటీర్లతో బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారు. ప్రజలు జగన్‌ను ఎప్పుడు ఇంటికి పంపిద్దా మా ? అని సిద్ధంగా ఉండడంతో కొత్త డ్రామా తెరలేపి గులకరాయితో దాడి చేయించుకొని స్టిక్కర్ సానుభూతి పొందాలని నాటకాలు ఆడుతున్నారు. నన్ను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా. ఆకివీడులో రైల్వే అండర్‌పాస్ ఏర్పాటు చేయిస్తా'నని ఉండి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. బుధవారం ఆకివీడు మండలం దుంపగడప, మందపాడు, చెరుకుమిల్లి, అయి-భీమవరం, తాళ్ళకోడు, కొత్తకాలనీ, కుప్పనపూడి, అజ్జమూరు గ్రామాల్లో ఎమ్మెల్యే మంతెన రామరాజు, నరసాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జనసేన ఇన్‌చార్జ్ జుత్తిగ నాగరాజులతో కలిసి ప్రచారం నిర్వహించారు. మందపాడు, అయి-భీమవరంలో 30 మంది వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. అయి-భీమవరంలో మాజీ ఎంపీ, కనుమూరి బాపిరాజు-అన్నపూర్ణమ్మలను మర్యాదపూర్వంగా కలిశారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు మోటుపల్లి రామవరప్రసాద్, పిన్నమరాజు శ్రీనివాసరా జు, సత్యనారాయణరాజు, ముత్యాల రత్నం, భూపతిరాజు తిమ్మరాజు, గంధం ఉమా, పిన్నమరాజు మురళీరాజు, తసెల్, పిల్లా బాబులు, కోరా రామూర్తినాయుడు, ఏడుకొండలు, చిట్టిబాబు, నాగబాబు, దాసరి బాలకృష్ణ, అజ్మల్, కాశీ ఉన్నారు.



ప్రచారంలో ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్ఆర్ఆర్, నరసాపురం ఎంపీ అభ్యర్థి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే రామరాజు



అయి-భీమవరంలో మాజీ ఎంపీ, బాపిరాజును కలిసిన ఆర్ఆర్ఆర్, రామరాజు తదితరులు

వైసీపీ పాలనలో వైద్యానికే రోగం!

ప్రతిపక్ష నాయకుడిగా పాలకొల్లు నియోజకవర్గంలో పాదయాత్రలో జగన్ ఘనమైన హామీలు ఇచ్చారు. సీఎంగా జగన్ పాలనలో వైద్యానికే రోగమొచ్చింది.! పాలకొల్లు ఏరియా ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆస్పత్రి హామీకి మతిమరుపు రోగం. సీఎంగా పాలకొల్లులో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మిస్తామన్నారు. వైద్య కళాశాలకు నిర్లక్ష్యం రోగం అంటుకుంది. ఐదేళ్లు గడిచిపోయాయి. అదే రోగాలతో నియోజకవర్గం వైద్యం కోసం ఎదురుచూస్తోంది. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తామన్నారు. కనీస సౌకర్యాలు లేకుండా కొందరికి మాత్రమే ఇళ్లు అప్పగించారు. లబ్ధిదారులందరికీ రుణాలు అప్పగించారు. పట్టణ ప్రజల తాగునీటి అవసరాలకు గోదావరి జలాల తరలింపు హామీ గోదారిలో కొట్టుకుపోయింది. కొబ్బరికి గిట్టుబాటు ధర హామీ ఐదేళ్లుగా చెట్టెక్కి కూర్చుంది.

\- పాలకొల్లు అర్బన్



- వైద్య కళాశాల నిర్మాణ పనులు చేపట్టలేదు
- ఏరియా ఆస్పత్రి వంద పడకల స్థాయికి పెరగలేదు
- పట్టణ ప్రజల దాహార్తికి గోదావరి జలాలు ఇవ్వలేదు
- కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర హామీ చెట్టెక్కింది
- టిడ్కో ఇళ్లు ఇవ్వలేదు.. రుణాలు అప్పగించారు

వైద్య కళాశాల ఎక్కడ జగనన్నా..



జిల్లాకో వైద్య కళాశాల అంటూ పాలకొల్లు సమీపంలోని దగ్గులూరులో కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు హడావుడి చేశారు. 60 ఎకరాల వ్యవసాయ భూమి సేకరించారు. సంబంధిత రైతులకు సొమ్ము చెల్లించడంలోనే ఏడాది జాప్యం చేశారు. భవనాల నిర్మాణానికి రూ.475 కోట్లు కేటాయించామన్నారు. కనీసం పనులు ప్రారంభించకుండానే పదవీ కాలం ముగిసింది. పట్టణంలో వంద పడకల ఆస్పత్రి హామీ అమలు చేయలేదు. తాగునీటికి గోదావరి జిల్లాలు తీసుకురాలేదు.

పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నియోజకవర్గ కేంద్రమైన పాలకొల్లు పట్టణంలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరించలేదు. శంభునిపేటలో అబ్దుల్ కలాం పార్కు, రామగుండం పార్కు, 27వ వార్డులో నిర్మాణంలో ఉన్న బీసీ కమ్యూనిటీ భవనం పూర్తి చేయలేదు. ఎన్‌టీఆర్, బివిరాజు కళాక్షేత్రం (ఓపెన్ ఎయిర్ థియేటర్), రహదారి బంగ్లా నిర్మాణం పూర్తి చేయలేదు. రూరల్ మండలం లంకలకోడేరు - వెలివెల రహదారిలో వంతెన నిర్మాణం పూర్తి చేయలేదు. లంకలకోడేరు నుంచి 27 గ్రామాలకు మంచి నీటి సరఫరా పథకాన్ని పూర్తి చేయలేదు. యలమంచిలి మండలంలో ఏటిగట్టు నిర్మాణం, డ్రెయిన్లపై అవుట్ ఫాల్స్ స్లూయిజ్‌ల నిర్మాణం, కుదేలైన ఆక్వా రంగానికి ప్రోత్సాహకాలను నిర్లక్ష్యం చేశారు. పోడూరు మండలం వద్దిపర్రులో నక్కల డ్రెయిన్‌కు సైడ్ వాల్స్ నిర్మాణం చేపట్టలేదు. పంట పొలాలు వరదల సమయంలో నీట మునుగుతున్నాయి. జిన్నూరు వంతెన నిర్మాణం పూర్తయినా అప్రోచ్ నిర్మాణం కాకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

పడకేసిన వంద పడకల ఆస్పత్రి

వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయలేదు. భవన నిర్మాణాలు అరకొరగానే జరిగాయి. పూర్తిస్థాయిలో సిబ్బంది లేక వైద్య సేవలందకపోవడంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వేలాది రూపాయలు వెచ్చించవలసి వస్తోంది. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం కాకపోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు తీవ్ర నిరాశ మిగిలింది.

నెరవేరని హామీలు

- ప్రతిపక్ష నాయకుడిగా గత ఎన్నికల ముందు పాదయాత్రగా ప్రజల ముందుకు వచ్చిన జగన్ హామీలు గుప్పించారు. అధికారంలో వచ్చిన తర్వాత ఒక్క హామీ కూడా అమలు చేయలేదు.
- వైసీపీ అధికారంలోకి రాగానే లబ్ధిదారులకు టిడ్కో గృహాలను ఉచితంగా ఇస్తామన్నారు. అందరినీ రుణాల్లో ముంచారు.
- కొబ్బరికి మద్దతు ధర ప్రకటించి రైతులకు అండగా ఉంటామని హామీలతో మురిపించి వదిలేశారు.
- పట్టణంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం గాలికొదిలేశారు.
- దమ్మయ్యపర్తి డ్రైయినేజీ పూర్తిస్థాయిలో నిర్మించి సమస్య పరిష్కరిస్తామన్నారు. తర్వాత పట్టించుకోలేదు.
- పాలకొల్లు పట్టణంలో ప్రధాన సమస్యల డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఐదేళ్లుగా సమస్య అలాగే ఉంది.
- పాలకొల్లు ప్రజల తాగునీటి సమస్య తీర్చడానికి విజ్జేశ్వరం నుంచి పైపులైన్ ద్వారా మంచినీరు సరఫరా హామీ అమలు చేయలేదు.

టిడ్కో లబ్ధిదారులకు రుణాల మోసం




టీడీపీ ప్రభుత్వం 90 శాతం పూర్తి చేసిన టిడ్కో గృహాలను కేటాయించడంలో లబ్ధిదారులను వైసీపీ ప్రభుత్వం మోసం చేసింది. పట్టణంలో టీడీపీ ప్రభుత్వం సుమారు 7 వేల గృహాలు నిర్మించగా వాటికి వైసీపీ రంగులు వేసుకోవడం తప్ప చేసింది శూన్యం. 2 వేల ఇళ్లను అరకొర సౌకర్యాలతో లబ్ధిదారులకు స్వాధీనం చేశారు. తర్వాత మరో 1800 మందికి అందజేశారు. మిగిలిన ఇళ్లను అందజేయకపోగా రుణం చెల్లించాలని బ్యాంకుల నుంచి నోటీసులు రావడంతో లబ్ధిదారులు అవాక్కయ్యారు. ప్రభుత్వం రుణం తీసుకుని తమను మోసం చేసిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లను స్వాధీనం చేయకుండా రుణాలు ఏవిధంగా చెల్లించాలని, ఉచితంగా అందిస్తానని జగన్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నిస్తున్నారు.

కొబ్బరి గిట్టుబాటు చెట్టెక్కింది



కొబ్బరి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామంటూ గత ఎన్నికల ముందు జగన్ హామీ ఇచ్చారు. కేరళలో ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్‌లు నెలకొల్పారు. కొబ్బరి వ్యర్థాలతో ఎరువులు తయారు చేస్తున్నారు. ఇక్కడ మాత్రం ప్రభుత్వపరంగా ఎటువంటి సహకారం లేదు. కొబ్బరికి సరైన ధర లేదు. ప్రభుత్వ ప్రోత్సాహం లేదు. ఉత్పత్తి కూడా తగ్గిపోయింది. కొబ్బరి ఆధారిత పరిశ్రమలకు చేయూతనిస్తామంటూ చెప్పుకొచ్చిన జగన్‌మోహన్ రెడ్డి ఆచరణలో తుస్సుమనిపించారు. ఒకప్పుడు జిల్లాలో కొబ్బరి మంచి ప్రసిద్ధిగా ఉండేది. ఇక్కడ నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు గణనీయంగా ఎగుమతి అయ్యేవి. ఇటీవల కాలంలో కొబ్బరి తోటలను రైతులు తొలగించేస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో కొబ్బరి రైతు నీరుగారిపోతునాడు.

పునాది రాయి పడని వైద్య కళాశాల



పాలకొల్లు రూరల్ మండలం దగ్గులూరు వద్ద మెడికల్ కళాశాల పనులు జరుగుతున్నాయంటూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఏడాదిన్నర క్రితం నర్సాపురం సభలో ప్రకటించారు. వాస్తవానికి ఇప్పటికీ పునాది రాయి పడలేదు. వైద్య కళాశాల నిర్మాణం నిమిత్తం దగ్గులూరు వద్ద 63 ఎకరాలను సేకరించారు. ఏడాది వరకు సంబంధిత రైతులకు సొమ్ము చెల్లించలేదు. నిర్మాణ ఏజెన్సీ ఖరారు చేయడంలో జాప్యం చేశారు. కళాశాల నిర్మాణం కోసం రూ.475 కోట్లు కేటాయించారు. తర్వాత మెగా ఏజెన్సీకి పనులు అప్పగించినట్లు చెప్పిన పనులు ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. కనీసం స్థలం పూడిక కూడా చేయలేదు. ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడం వల్లే కళాశాల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది.



పోలవరంలో మధ్యలో ప్రచారం ఆపిన అభ్యర్థులు

ఎండ దెబ్బకు మహిళా అభ్యర్థికి అస్వస్థత

ఏలూరు ఎంపీ, పోలవరం అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ తరపున ఇద్దరూ మహిళా అభ్యర్థులే పోటీలో ఉన్నారు. ఎంపీ అభ్యర్థి కావూరు లావణ్య, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వెల సృజనతో పాటు పార్టీ మండల అధ్యక్షురాలు ముచ్చిక సీత బుధవారం పోలవరంలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. పాత పోలవరం నుంచి మధ్యాహ్నం ఎండలో తిరుగుతున్నారు. ఎండ తీవ్రతకు ఎంపీ అభ్యర్థి లావణ్య ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కార్యకర్తలు, నేతలు స్పందించి చల్లటి నీరందించి సపర్యలు చేయడంతో కోలుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో ప్రచారం మధ్యలో ముగించి వెనుదిరిగారు. **- పోలవరం**

ఈవీఎంల రెండో దశ ర్యాండమైజేషన్

ఏలూరు సిటీ, మే 1: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా రెండో దశ ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎన్నికల సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్ సమక్షంలో నిర్వహించిన రెండోదశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియకు పలువురు అభ్యర్థులు, వారి ప్రతినిధులు హాజరయ్యారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తయింది. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక అనుబంధ పోలింగ్ స్టేషన్‌తో కలిపి 1,744 పోలింగ్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నూజివీడు నియోజకవర్గంలో 286, పోలవరం- 284, చింతలపూడి- 273, దెందులూరు- 239, కైకలూరు - 235, ఉంగుటూరు- 214, ఏలూరు నియోజకవర్గంలో 213 పోలింగ్ కేంద్రాల వారీగా ఆన్‌లైన్ ద్వారా ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియతో కేటాయించారు. డీఆర్వో పుష్పమణి, నోడల్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా ఎన్ఐసీ అధికారి శర్మ తదితరులు పాల్గొన్నారు.



లెక్క చెప్పాల్సిందే..!

అభ్యర్థుల ఎన్నికల ఖర్చుకు పరిమితి

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఖర్చులు తక్కువ చేసి చూపుతామంటే కుదరదు. ప్రస్తుత ధరలను బట్టి ఎన్నికల కమిషన్ దేనికి ఎంత వ్యయం అవుతుందో ఓ లెక్క సిద్ధం చేసింది. ఈ లెక్క ప్రకారం అభ్యర్థులు తమ ఖర్చులను సమర్పించాల్సి ఉంటుంది. ఎన్నికల ప్రచారం అంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అభ్యర్థుల వెంట అనుచరులు వస్తారు. ప్రచారానికి వెళ్లడానికి వాహనం, అనుచరుల భోజన సదుపాయాలు చేయాల్సిందే. మరోవైపు సభలు, ర్యాలీలు చేస్తే మరింత వ్యయం వాటికి సంబంధించిన లెక్కలను ఈసీకి అభ్యర్థులు చూపాల్సి ఉంటుంది. వాటర్ ప్యాకెట్ నుంచి, టిఫిన్, బిర్యానీ ఎక్కిన వాహనం, పెట్టిన మైకు, కట్టిన బ్యానర్, ఎగిరిన జెండాకు లెక్కలను పక్కాగా ఈసీకి చూపించాల్సిందే. అభ్యర్థుల వ్యయ పరిశీలనకు మండల నియోజకవర్గ స్థాయిలో ఈసీ పరిశీలకులను నియమించింది.

అభ్యర్థుల వ్యయ పరిమితి

ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులను కేంద్ర ఎన్నికల సంఘం వ్యయ పరిమితి విధించింది. ప్రస్తుత ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గరిష్ఠంగా రూ.90 లక్షలు ఖర్చు చేసుకోవచ్చు. ఎమ్మెల్యే అభ్యర్థి గరిష్ఠంగా 40 లక్షలు వ్యయం చేసుకోవచ్చు. ఎన్నికల్లో ఈసీ సూచించిన పరిమితి కంటే ఎక్కువ అభ్యర్థులు ఖర్చు చేస్తారనేది బహిరంగ రహస్యం. ఈసీకి లెక్కలు మాత్రం పరిమితి కంటే కనీసం ఐదు ఆరు లక్షల రూపాయలు తక్కువగానే చూపిస్తారు. ఎన్నికలు లెక్కలు రాయడంలో ప్రతి నియోజకవర్గంలో ఆరితేరిన చిత్రగుప్తులు ఇందుకు ప్రత్యేకంగా ఉన్నారు. వారి ద్వారానే అభ్యర్థులు ఈసీ లెక్కలు రాయిస్తారు.

ఇలా ఖర్చు చేయాలి..

కోలాటానికి రూ5 వేలు, డ్రమ్స్ లేదా బ్యాండ్ రూ.వెయ్యి, లైట్స్ రోజుకు రూ. 300, 8 అడుగుల జెండా రూ.1500, వీడియో గ్రాఫర్‌కు రూ.5 వేలు, పువ్వులకు రూ.350, సౌండ్ బాక్స్‌లకు రూ.2 వేలు, పూల బొకేకు రూ.500, కరపత్రాలు వందకు రూ.600, బిస్కెట్ ప్యాకెట్‌కు రూ.40, విజిటేరియన్ భోజనం రూ.100, నాన్‌వెజ్ భోజనం లేదా బిర్యానీ రూ.150, పూరీ రూ.40, టీ రూ.10, బస్సుకు రూ.20 వేలు, వివిధ వాహనాలకు వివిధ రేట్లు ఉన్నాయి. డ్రైవర్‌కు రోజు భత్యం రూ.520, ఇలా ప్రతి దానికి ఈసీకి ఒక లెక్క ఉంది. దానిని బట్టి ఖర్చులు సమర్పించాల్సి ఉంటుంది. **- అత్తిలి**



ఎన్నికల వ్యయంపై సమీక్షిస్తున్న పరిశీలకుడు అగర్వాల్, ఆర్డీవో అంబరీష్

ఎన్నికల వ్యయ నిబంధనలు పాటించాలి

నరసాపురం, మే 1: సాధారణ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఖర్చుల నిబంధనలు పాటించాలని ఎన్నికల పరిశీలకులు మోహన్‌లాల్ అగర్వాల్ సూచించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పర్యవేక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. నరసాపురం, పాలకొల్లు, ఆచంట నియోజవర్గాలకు సంబంధించిన అసెంబ్లీ అభ్యర్థులు వ్యయ పరిశీలనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో నగదు బట్వాడా, బహుమతులు, మద్యం తరలింపు తదితర అంశాలపై పర్యవేక్షణ ఉండాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్, నియోజకవర్గ వ్యయ పరిశీలకులు పాల్గొన్నారు.

ఉండమ్మా బొట్టు పెడతా..!



శుభకార్యాలకు మహిళలకు బొట్టు పెట్టి ఆహ్వానించడం ఆనవాయితీ. ఇప్పుడది ఎన్నికల ప్రచారానికి పాకింది. అభ్యర్థుల తరపున మహిళలు, వారి కుటుంబ సభ్యులు ప్రచారానికి ఇంటింటికీ వెళ్లి గృహిణుల నుదుట కుంకుమ బొట్టు పెట్టి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కుంకుమ బొట్టు పెట్టి మహిళా ఓటర్లను సెంటిమెంట్‌తో ఓటు అడుగుతున్నారు.. ఈ ఎన్నికల్లో ఓ అడుగు ముందుకేసి కంఠానికి గంధం కూడ రాస్తున్నారు. ఒట్టి చేత్తో ఓటు అడిగితే ఏం బాగుంటుందని అనుకుంటున్నారో ఏమో గానీ ఓ బొట్టు పెట్టి బ్యాలెట్ నమూనా పేపర్ మహిళల చేతిలో పెడుతున్నారు. **- ముదినేపల్లి**

మహిళలకు తాయిలాలు



ఎన్నికలలో మహిళలకు తాయిలాల ఆశ చూపుతున్నారు. ఎన్నికల కోడ్ ముందు ఒక నియోజకవర్గంలో డ్వాక్రా మహిళలకు అధికార పార్టీ వారు చీరలు అందించారు. ఇప్పుడు మరొక నియోజకవర్గంలో డ్వాక్రా గ్రూపుల లోని మహిళలకు రూ.వెయ్యి, డ్వాక్రా గ్రూపులన్నింటికి కలిపి గ్రామాలలో ఉండే లీడర్ లకు రూ.25 వేలు తాయిలాలు అందిస్తున్నారు. ఎన్నికలతో మహిళల పంట పండినట్లే. పార్టీలు మహిళలకే ప్రాధాన్యం ఇవ్వడంతో ముందుగా పోటీ అభ్యర్థులు మహిళల ఓటర్లపైనే ఆకర్షితులుగా నిలుస్తున్నారనిపిస్తుంది. ఈ లెక్కన నియోజకవర్గంలో లెక్క వేస్తే కోట్ల రూపాయలు మహిళలకు తాయిలాలుగా ముట్ట చెబుతారేమో..? **- భీమవరం రూరల్**

షరుకు లేదా..?

మందుబాబుల చిర్రు బుర్రు



ఎన్నికల సంఘం నిబంధనలు మందు బాబులకు నిరాశ కలిగిస్తున్నాయి. కావల్సినంత మద్యం అందక ఉసూరుమంటున్నారు. రోజు వారీ అమ్మకాల లక్ష్యం పూర్తయితే ఏ సమయంలోనైనా ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసేయొచ్చు. ఒక్కోసారి మద్యం దుకాణం ఆ రోజు మధ్యాహ్నానికే మూతపడుతోంది. ఆ సమయానికి వచ్చిన మందు బాబులు మద్యం దొరక్క ఊగిపోతున్నారు. దగ్గరలోని బెల్టుషాపులను ఆశ్రయిస్తున్నారు. తనిఖీలకు భయపడి బెల్టుషాపుల్లో కూడ మద్యం కొరత ఏర్పడడంతో మందుబాబులు చిర్రెత్తి పోతున్నారు. ఒక వేళ మందు ఉన్నా క్వార్టర్ బాటిల్‌కు రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారు. **- ముదినేపల్లి**

మన సంగతేంటి.?



ఎన్నికల్లో విజయావకాశాలను బేరీజు వేసుకుంటూ అభ్యర్థులు, నాయకులు టెన్షన్‌తో సతమతమవుతున్నారు. ఈసారి ఓటుకు రేటెంత పలుకుతుందని, మన సంగతేంటని పలువురు తాపీగా రచ్చబండ చర్చలు సాగిస్తున్నారు. పార్టీలు, అభ్యర్థులు పోటా పోటీ తలపడుతుండడంతో కొంతమంది ఓటర్లు ఈసారి సొమ్ములు గట్టిగానే అందుతాయని ఎదురుచూస్తున్నారు. గత ఎన్నికల కంటే ఎక్కువే వస్తాయిలే కంగారు పడొద్దంటూ కబుర్లు చెబుతున్నారు. దానికి కూడ కొంతమంది ఓ లెక్క చెబుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు గెలుపు ఈసారి ప్రతిష్ఠాత్మకం. పోటా పోటీగా డబ్బులు పంచి పెడతార్రా అనుకుంటున్నారు. ఓటుకు నోటు అలవాటు చేశారు కదా తప్పదు మరి.! **- ముదినేపల్లి**

తండ్రి కోసం.. తనయ ప్రచారం



తండ్రి విజయం సాధించాలని తనయ ప్రచారం సాగిస్తోంది. ఉండి మండలం పాందువ్వలో కూటమి అభ్యర్థి కనుమూరు రఘురామకృష్ణరాజు కుమార్తె ఇందిరా ప్రియదర్శిని తన తండ్రిని గెలిపించాలని కోరారు. ముందుగా గ్రామంలో కొండాలమ్మను దర్శించుకున్నారు. **- ఉండి**

ఓటు.. మూడు కిలో మీటర్ల దూరం



కుక్కునూరు మండలంలోని మారుమూల అటవీ ప్రాంతానికి చత్తీస్‌ఘడ్, ఒడిశా ప్రాంతాల నుంచి దాదాపు 20 ఏళ్ల క్రితం వేలాది మంది ఆదివాసీలు తరలివచ్చారు. వారిలో ఇటీవల దాదాపు 1500 మంది ఆదివాసీలకు కొత్తగా ఓటు హక్కు కల్పించారు. వారంతా ఓటు వేయాలంటే మారుమూల గ్రామాల నుంచి 3 నుంచి 5 కిలోమీటర్లు నడవాల్సిందే. రవాణా సౌకర్యం లేకపోవడంతో అటవీ మార్గంలో నడకే శరణ్యం. పలు పార్టీల నాయకులు ఆదివాసీలను కలసి ఓటు అభ్యర్థించారు. దాదాపు 1500 ఓట్లు ఉండడంతో వామపక్షాలతో పాటు ప్రధాన పార్టీలు కూడా ఆదివాసీల ఓట్లపై గురిపెట్టాయి. మౌలిక సదుపాయంతో పాటు పోడు భూములకు పట్టాలు కూడా కల్పిస్తామని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల తరుపు హామీ ఇస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆదివాసీలంతా మారుమూల ప్రాంతానికి వచ్చి నివాసం ఉంటున్నప్పటికీ ఆ గ్రామాల్లోనే వారంతా మగ్గిపోతున్నారు. కొన్నేళ్లుగా వారికి ప్రభుత్వాలు రేషన్‌కార్డు, ఓటు హక్కు కల్పించాయి. అటవీ ప్రాంతంలో కురుములతోగు గిరిజనులు రెండు కిలో మీటర్ల నడిచి దామరచర్లకు, చీపురుచెలక ఆదివాసీలు ఉప్పేరు గ్రామానికి, రేగులచెరువు ఆదివాసీలు అమరవరం గ్రామానికి, గుట్టపుతోగు ఆదివాసీలు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న బంజరగూడెం గ్రామానికి, రామాపురం ఆదివాసీలు బంజరగూడెం, లచ్చపేట ఆదివాసీలు అరవైపల్లికి, తెల్లరాయిగూడెం ఆదివాసీలు కివ్వాక గ్రామానికి కాలినడకన వెళ్లి ఓటు వేయాల్సిందే. **- కుక్కునూరు**



సమరయోధుల గడ్డ

ఫ్లాష్ బ్యాక్

నాటి హేలాపురి.. నేటి ఏలూరు
పారిశ్రామికంగా, విద్యాపరంగా అభివృద్ధి
మహాత్మాగాంధీ నడయాడిన ప్రదేశం
టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి కంచుకోట
నేటికీ దర్శనమిస్తున్న బ్రిటిష్ కట్టడాలు

రాష్ట్రంలోనే ఏలూరుకు ప్రాధాన్యం ఉంది. చారిత్రాత్మకంగా, పారిశ్రామి కంగా, విద్యాపరంగా, పర్యాటకంగా ఏలూరు అభివృద్ధి చెందింది. స్వాతంత్ర్య సమరయోధుల గడ్డగా ఏలూరు ప్రసిద్ధి. చుట్టూ ఏరులున్న ఊరు కావడంతో ఆనాడు ఏలూరు అనే నామకరణం చేశారని చరిత్ర చెబుతోంది. ఏలూరును హేలాపురి నగరంగా పిలుస్తారు. కృష్ణా జిల్లాలోని కొన్ని తాలూకాలను, గోదావరి జిల్లాలోని పోలవరం తాలూకాను కలిపి ఆనాడు పశ్చిమ గోదావరి జిల్లాగా ఏర్పాటు చేయాలని 1925 ఏప్రిల్ 15వ ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేసింది.ఆ జిల్లాకు కేంద్రంగా ఏలూరును నిర్ణయించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రంగా ఏలూరు విలసిల్లింది. ఇటీవల కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా ఏలూరు కేంద్రంగా ఏలూరు జిల్లాను ఏర్పాటు చేశారు. - ఏలూరు సిటీ

ఏలూరు నగరానికి ఒకపక్క పల్లపు ప్రాంతాలుగా కొల్లేరు, కైకలూరు, మరో పక్క మెరక ప్రాంతాలుగా చింతలపూడి, జంగారెడ్డిగూడెం ఉన్నందున ఇక్కడ నిత్య జీవితంలో రెండు ప్రాంతాల ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. చింతలపూడి నుంచి వచ్చే తమ్మిలేరు వాగు ఏలూరు చివర అశోక్‌నగర్ వద్ద రెండుగా చీలుతుంది. ఎడమవైపు చీలిన వాగు తంగెళ్ళమూడి మీదుగా ప్రవహిస్తూ నగరానికి ఒక వైపు సరిహద్దుగా వుంది. తమ్మిలేరు కాలువకు ఆవల ప్రాంతాన్ని వన్‌టౌన్ అని, ఇవతల వున్న ప్రాంతాన్ని టూటౌన్ అని పిలుస్తారు.

విద్యాపరంగా అభివృద్ధి

ఏలూరు విద్యాపరంగా అభివృద్ధి సాధించింది. ఇక్కడ ప్రధానంగా మహాత్మాగాంధీ ప్రారంభించిన గాంధీ ఆంధ్రజాతీయ మహా విద్యాలయంతో పాటు సర్ సీఆర్ఆర్ విద్యాసంస్థలు, సెయింట్ థెరిస్సా విద్యాసంస్థలు ఎంతో పేరు ప్రఖ్యాతులు సాధిం చాయి. 1945లో సర్ కట్టమంచి రామలింగారెడ్డి పేరున సీఆర్ఆర్ కళాశాల ఏర్పాటు అయింది. ఆ తరువాత ఆశ్రం మెడికల్ కళాశాల ఏర్పాటు కాగా ఎన్నో కార్పోరేట్ విద్యా సంస్థలతో పాటు చరిత్ర కలిగిన ఎన్నో విద్యాలయాలు ఇక్కడ ఏర్పాటయ్యాయి.

వైద్య కళాశాల ఏర్పాటు



ఎన్నో దశాబ్దాలుగా ఏలూరు ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్న మెడికల్ కళాశాల ఏర్పాటు కావడంతో ఈ ప్రాంతంలో వైద్యపరంగా అభివృద్ధి సాధ్యమైంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019లో ఇక్కడ మెడికల్ కళాశాల ఏర్పాటుకు జీవో విడుదలైంది. రూ. 430 కోట్లు మంజూరు చేశారు. 2023 ఏప్రిల్ నెలలో ఏలూరులో మెడికల్ కళాశాల ఏర్పాటైంది. ఈ కళా శాలకు మెడికల్ కౌన్సిల్ 150 సీట్లు కేటాయించారు. టీచింగ్ ఆస్పత్రికి 300 పడకలు కేటాయించారు. ఇక్కడ మెడికల్ కళాశాల ఏర్పాటుతో ఈ ప్రాంత వాసుల కల నెరవేరింది. ఇప్పటికే ప్రైవేటు రంగంలో ఆశ్రం మెడికల్ కళాశాల ఉండగా ప్రభుత్వ పరంగా ఏలూరు మెడికల్ కళాశాల కూడా ఏర్పాటు కావడంతో ఏలూరు జిల్లా వాసులకు వైద్య పరంగా సేవలు అందనున్నాయి.



పారిశ్రామిక ప్రగతి

ఏలూరులో ఎంతో ప్రసిద్ధి గాంచిన అంబికా గ్రూప్ సంస్థల ఆధ్వర్యంలో అంబికాదర్బార్ బత్తి పరిశ్రమ ఎందరికో ఉపాధి కల్పిస్తోంది. అలాగే ఇక్కడ ఎన్నాళ్ల నుంచో తివాచీ పరిశ్రమ, చేనేత పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. ఏలూరు తివాచీలకు అంతర్జాతీయంగా మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఇక్కడ నుంచి రక రకాల డిజైన్లలో తివాచీలు విదేశాలకు కూడా ఎగుమతి అవుతుంటాయి. శనివారపుపేట,తంగెళ్ళమూడిలలో ఈ తివాచీ పరిశ్రమలు ఉన్నాయి. ప్రస్తుతం చేతితో తయారు చేసే తివాచీలకు ఆదరణ తగ్గటంతో కార్మికులు వీధిన పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే ఇక్కడ పత్తేబాదలో చేనేత పరిశ్రమ అభివృద్ధి చెందింది. చేనేత చీరలు ఇక్కడ సొంతంగా చేనేత కార్మికులు రూపొందిస్తారు. ఈస్టిండియా కంపెనీ వారి జనపనార పరిశ్రమ (జూట్‌మిల్) నగరలోట ఎంతోమందికి ఉపాధి నిచ్చేది. ఈ పరిశ్రమ గత ఏడాది మూత బడింది.

స్వాతంత్రోద్యమంలో ఏలూరు

స్వాతంత్రోద్యమంలో ఏలూరు ప్రధాన భూమిక పోషించింది. మహాత్మా గాంధీజీ 1921 ఏప్రిల్ 25న ఏలూరు విచ్చేశారు. ఆనాడు 50 వేల మందితో సభ ఏర్పాటు చేశారు. 1894లో ఏలూరులో జరిగిన కృష్ణా జిల్లా రైతుల మహా సభలో నీటి తీరువా హెచ్చింపునకు వ్యతిరేకంగా తీర్మానించి నీటి తీరువా తగ్గించేవరకు భూములను సాగు చేయకుండా బీడు పెట్టాలని నిర్ణయించారు. ఎన్నో స్వాతంత్రోద్యమాలకు ఆనాడు ఏలూరు వేదిక అయింది.



సంస్కృతీ సంప్రదాయాలకు నెలవు

సంస్కృతిపరంగా ఏలూరు ఎంతో అభివృద్ధి సాధించింది. ఏలూరులో ఉన్న వైఎంహెచ్ఏ హాలు కూడా సాంస్కృతీ కేంద్రంగా విలసిల్లుతోంది. ఎంతో మంది కళాకారులు ఇక్కడ నుంచి వెళ్లిన వారే పసుపులేటి కన్నాంబ ఏలూ రుకు చెందిన వారే . ఎంతో మంది నర్తకీ మణులు ఇక్కడ నుంచి వచ్చినవారే. రిజర్వు బ్యాంక్ గవర్నరుగా పనిచేసిన దువ్వూరి సుబ్బారావు ఈ ప్రాంత వారే అని చెప్పవచ్చు. ఆనందరామం వంటి వారు కూడా ఈ ప్రాంతానికి చెందిన వారే కావడం విశేషం.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	జి.సత్యనారాయణ	సీపీఐ	ఎం.రంగయ్య	కాంగ్రెస్	7,638
1955	శీర్ల బ్రహ్మయ్య	కాంగ్రెస్	ఎఎస్ రావు	సీపీఐ	5,306
1962	ఎ.సర్వేశ్వరరావు	కాంగ్రెస్	ఎ.సర్వేశ్వరరావు	సీపీఐ	4,840
1972	ఏ.శ్రీరాములు	ఇండిపెండెంట్	ఎం.వెంకటనారాయణ	కాంగ్రెస్	1,805
1978	ఎస్.సూర్యప్రకాశరావు	కాంగ్రెస్-ఐ	ఏ.శ్రీరాములు	జనతా	10,712
1983	చెన్నకేశవుల రంగారావు	టీడీపీ	వీవీఎస్ నారాయణ	కాంగ్రెస్-ఐ	47,715
1985	మరడాని రంగారావ	టీడీపీ	ఎస్‌బీ సత్యనారాయణ	కాంగ్రెస్-ఐ	20,040
1989	నేరెళ్ళ రాజా	కాంగ్రెస్-ఐ	మరడాని రంగారావు	టీడీపీ	4,339
1994	మరడాని రంగారావు	టీడీపీ	మాగంటి వరలక్ష్మి	కాంగ్రెస్-ఐ	9,247
1999	అంబికా కృష్ణ	టీడీపీ	ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్	కాంగ్రెస్-ఐ	7,315
2004	ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్	కాంగ్రెస్-ఐ	ఎం.రంగారావు	టీడీపీ	33,053
2009	ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్	కాంగ్రెస్-ఐ	బడేటి కోట రామారావు	ప్రజారాజ్యం	13,862
2014	బడేటి కోట రామారావు	టీడీపీ	ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్	వైసీపీ	24,063
2019	ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్	వైసీపీ	బడేటి కోట రామారావు	టీడీపీ	4,072



నియోజకవర్గం : ఏలూరు
మొత్తం ఓటర్లు : 2,35,426
పురుష ఓటర్లు : 112,426
మహిళా ఓటర్లు : 1,22,872
ఇతర ఓటర్లు: 47
మండలాలు: ఏలూరు, కార్పోరేషన్, ఏలూరు రూరల్ మండలం


టీడీపీకి కంచుకోట

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1951లో ఏలూరు అసెంబ్లీ నియోజక వర్గం ఏర్పాటు అయింది. 1983లో టీడీపీ ఆవిర్భావం తర్వాత 9 సార్లు ఎన్నికలు జరుగగా ఐదు సార్లు టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. 1983లో టీడీపీ ప్రభంజనంలో ఏలూరులో వైద్యవృత్తిలో పేదల కోసం విశేష సేవలందించిన డాక్టర్ చెన్న కేశవుల రంగారావును ఆనాడు ఎన్టీ రామారావు టీడీపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్-ఐ పార్టీ అభ్యర్థి నారాయణపై 47,515 ఓట్ల అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ నియోజకవర్గంలో అంత పెద్ద మెజా రిటీ సాధించిన అభ్యర్థులు ఎవరూ లేరు.1985లో జరిగిన ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిగా మరడాని రంగారావు పోటీ చేసి విజయం సాధించారు. ఆయన ఎన్టీఆర్ కేబినెట్‌లో మంత్రిగా కూడా పనిచేశారు. ఇక ఏలూరు అసెంబ్లీ నియోజక వర్గ చరిత్రలో మూడు సార్లు ఒకే అభ్యర్థి విజయం సాధించిన వ్యక్తి ఒక్కరే ఉన్నారు. ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్ 1999 నుంచి 2019 వరకు 5 సార్లు ఎన్నికలలో పోటీ చేసి 3 సార్లు విజయం సాధించారు. కాంగ్రెస్ తరపున రెండు సార్లు, వైసీపీ తరపున ఒకసారి ఆయన విజయం సాధించారు. 1999 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసి విజయం సాధించిన తొలి పారిశ్రామిక వేత్త అంబికా కృష్ణగా పేర్కొనవచ్చు. 2009లో ప్రజారాజ్యం పార్టీ తరపున బడేటి కోట రామారావు పోటీచేసి ఓటమి చెందినా రెండో స్థానాన్ని దక్కిం చుకున్నారు. అప్పట్లో టీడీపీ తరపున పోటీచేసిన అంబికా కృష్ణ మూడో స్థానంలో నిలిచారు. 2014లో జరిగిన ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిగా బడేటికోట రామారావు పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్‌పై 24,603 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2019 ఎన్నికలలో వైసీపీ అభ్యర్థి ఆళ్ళకాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని) టీడీపీ అభ్యర్థి బడేటి కోట రామారావుపై 4,072 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2019లో జనసేన పార్టీ ఆవిర్భావం కాగా జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన రెడ్డి అప్పల నాయుడుకు 16,800 ఓట్లు వచ్చాయి. ఈ నియోజక వర్గంలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన నేతలు అభ్యర్థులుగా విజయం సాధించారు.

సీఎం వచ్చారుగా..

నరకం చూసిన ఏలూరు ప్రజలు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటనతో బుధవారం ఏలూరు ప్రజలు నరకం చూశారు. అసలే మండుతున్న ఎండలు. ఆపై ప్రధాన రహదారులు మూసి వేయడంతో జనం ఎటు వెళ్లాలో తెలియక నానా అవస్థలు పడ్డారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి, కోర్టు ఉన్న ప్రధాన రహదారి పైనే రోడ్‌షో ఉండడంతో ఉదయం 11 గంటల నుంచే పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ప్రభుత్వాసుపత్రికి వెళ్ళేవారు కూడా నరకయాతన పడ్డారు. నగరానికి వచ్చే బస్సులు కూడా వేరే మార్గాల్లో పంపించారు. వ్యాపారులు షాపులను మూసుకోవాల్సి వచ్చింది. ద్విచక్ర వాహనాలు, కార్లతో ఆసుపత్రిలో హారన్స్ వేసుకుంటూ చక్కెర్లు కొట్టారు. రోగులకు తీవ్ర ఇబ్బందులు కలి గించారు. వైసీపీ కార్యకర్తలు ఆకతాయిలుగా మారారు. వాటర్ ప్యాకెట్లను చింపి ఆ నీళ్ళను మహిళలపై చిమ్మారు. జేబుదొంగలు జనం పర్సులు,సెల్‌ఫోన్లు కొట్టేశారు. ఆర్ఆర్ పేటలో పార్కింగ్ చేసిన ఒక మోటారు సైకిల్‌ను కూడా ఎత్తుకు పోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన ముగిసిన సాయంత్రం 6 గంటల వరకూ నగరంలోని ప్రజలు నరకయాతన చూడాల్సి వచ్చింది. - ఏలూరు క్రైం


బస్సులన్నీ బయటే.. బస్టాండ్ ఖాళీ..
పోలీసుల అధీనంలో నగరం
ఆసుపత్రికి వెళ్లే దారి బంద్


ఆర్‌ఆర్‌పేట వెళ్లే ప్రధాన రహదారిని మూసివేసిన దృశ్యం
ప్రజల అవస్థలు
సీఎం సభ కోసం విద్యుత్ స్తంభం కట్ చేశారు..



మూర్తి (ఫైల్)
నిడదవోలులో మూర్తి పార్థివదేహాన్ని మోస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ బాపిరాజు

గుండెపోటుతో జడ్పీ ఏవో మృతి

ఏలూరుసిటీ, మే 1:నిజాయితీగా సేవలందిస్తూ అందరి మన్ననలు పొందిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ హెచ్ సెక్షన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి (ఏవో)గా పనిచేస్తున్న కంజులూరి నరసింహమూర్తి (56) మంగళ వారం రాత్రి గుండెపోటుతో నిడదవోలులో మృతి చెందారు. జడ్పీ ఉద్యోగులు నిడదవోలు వెళ్లి మూర్తి పార్థివ దేహానికి నివాళులర్పించారు. జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజుకు మూర్తితో ఉన్న అనుబంధంతో అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోశారు. నరసింహమూర్తికి భార్య, కుమారుడు ఉన్నారు. నరసింహమూర్తి 1994లో జూనియర్ అసిస్టెంట్‌గా తన ఉద్యోగ జీవితాన్ని ఆరంభించారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో కొంతకాలం పనిచేసి అక్కడి నుంచి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాపరిషత్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై వచ్చారు. 2014 నుంచి 2019 వరకు అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజుకు మూర్తి సీసీగా పనిచేశారు. అనంతరం 2019లో విజ యవాడ ఏపీఎస్ ఐఆర్‌డీలో పనిచేసి తిరిగి పదోన్నతిపై జిల్లా ప్రజా పరిషత్‌కు అడ్మిని స్ట్రేటివ్ అధికారిగా వచ్చారు.ఆయన మృతికి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, జడ్పీ సీఈవో సుబ్బారావు, డిప్యూటీ సీఈవో నిర్మలా జ్యోతి, అకౌంట్స్ అధికారి ప్రకాష్, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రాజు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ గౌరవాధ్యక్షుడు గోవింద రాజులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.



డీఏలేవి ? జగనన్నా..!

ఐదేళ్లుగా ఉద్యోగుల అవస్థలు




ఉద్యోగుల సంక్షేమం పట్టని సర్కారు
పెరుగుతున్న ధరలతో పెనుభారం
ఐదేళ్లక్రితం నాటి జీతాలే దిక్కు
1వ తేదీ జీతం పడితే చాలనే పరిస్థితి
డీఆర్ కోసం పెన్షనర్ల ఎదురుచూపులు

(నిడమర్రు)

ప్రభుత్వం ఉద్యోగుల గురించి ఇసుమంతైనా పట్టించుకోవడం లేదు. న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన కరువు భత్యం బకాయిలు ఇప్పించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకొన్నా పట్టించుకున్న పాపానపోలేదు. ఉద్యోగులను కేవలం తమ సేవకులుగా మాత్రమే చూస్తున్నారని వాపోతున్నారు. ప్రతి ఆరు నెలలకు అందాల్సిన కరువు భత్యం ఇవ్వడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్క పెడుతోందని ఆవేదన చెందుతున్నారు. "అన్ని వస్తువుల ధరలు పెరిగి పోయాయి.. నానాటికి పెరుగుతున్న ఖర్చులు తట్టుకోలేక అప్పులు పాలవుతున్నామంటూ" ఒక ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వం ఇంత కసాయిగా వ్యవహరించలేదని ఉద్యోగులు వాపోతున్నారు.

1వ తారీఖున జీతం పడితే చాలనే పరిస్థితి

ప్రతి నెల 1వతారీఖున జీతం పడితే చాలనే పరిస్థితిలో ఉద్యోగులు ఉన్నారు. రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యంగా ఉపాధ్యాయులకు ప్రతి నెల 10 నుంచి 15వ తారీఖులోపు జీతం పడుతోంది. ఉద్యోగులకు ప్రతి నెల జీతం సొమ్ము నుంచి గృహం, వాహన,వ్యక్తిగత ఋణాలకు సంబంధించి ఈఎంఐలు కట్ అవుతాయి. ఇటీవల ప్రభుత్వం జీతాలు ఆలస్యంగా వేయడంతో అపరాధ రుసుముతో పాటు సిబిల్ స్కోరు కోల్పోవలసి వస్తోంది, అందుకే ఇటీవల ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో ఉద్యోగుల మొదటి డిమాండ్ 1వ తారీఖునే జీతాలు ఇప్పించాలని కోరారు.

మూడు డీఏలకు మంగళం

ఈ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు 10 డీఏలు ఇవ్వాల్సి ఉంది. రెండేళ్ల క్రితం విజయవాడలో ఉద్యోగులు ఆందోళన చేపట్టిన నాటికి ఆరు డీఏలు ఇవ్వాల్సి ఉంది. ఆ సమయంలో ఉద్యోగ వర్గాలతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా మూడు డీఏలు మాత్రమే ఇస్తామని మిగిలిన మూడు డీఏలు ఇవ్వలేమని చేతులెత్తేసింది. ఈ పరిస్థితుల్లో ఉద్యోగవర్గాలు చేసేది లేక కనీసం మూడు డీఏలు అయినా వస్తాయని ఎదురు చూశారు. ఈ మూడు డీఏలు కూడా 2024 మే నెలలో ఒక డీఏకు సంబంధించి సొమ్ము, జూలైలో కొంత, అక్టోబరులో కొంత ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. హామీ ఇచ్చిన డీఏలతో పాటు మరో నాలుగు డీఏలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

డీఆర్ కోసం పెన్షనర్ల అవస్థలు

రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు అందించే డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్) కూడా పెండింగ్‌లో పెట్టింది. 2018 నుంచి పెన్షనర్లుకు రావల్సిన డీఆర్ బకాయిలు ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించేదని మలివిడతలో ప్రవేశించిన పెన్షనర్లు కన్నీటి పర్యంతమవుతున్నారు.

జిల్లాలో ఉద్యోగులు :

ఆరోగ్య శాఖ	5,450
పోలీసు శాఖ	3,400
రెవెన్యూ శాఖ	7,200
ఉపాధ్యాయులు	14,500
ఎయిడెడ్	2,500
నాల్గో తరగతి	6,200
మొత్తం ఉద్యోగులు	**39,250**

పెన్షనర్లు వివరాలు :

సర్వీసు పెన్షనర్లు	15,200
ఫ్యామిలీ పెన్షనర్లు	10,750
జడ్పీ పెన్షనర్లు	2,500
మొత్తం పెన్షనర్లు :	**28,450**

డీఏ బకాయిలు ఇలా..

1. 07/2018 - 3.144% 30 నెలల బకాయిలు ట్రెజరీలో బిల్స్ పెండింగ్
2. 01/2019 - 3.144% 30 నెలలు
3. 07/2019 - 5.240%- 30 నెలలు
4.01/2020 -4.% -18 నెలల బకాయిలు కోవిడ్ ఖాతాలో మాఫీ అయ్యాయి. ఆరు నెలల బకాయిలు పీఆర్సీలో కలిపి రిటైర్మెంట్ నాటికి వస్తాయి.
5. 07/2020 - 5%-12 నెలల బకాయిలు కోవిడ్ ఖాతాలో మాఫీ అయ్యాయి. ఆరునెలల బకాయిలు పీఆర్సీలో కలిపి రిటైర్మెంట్ నాటికి వస్తాయి.
6. 01/2021 -5%- ఆరు నెలల బకాయిలు కోవిడ్ ఖాతాలో మాఫీ అయ్యాయి. ఆరు నెలల బకాయిలు పీఆర్సీలో కలిపి రిటైర్మెంట్ నాటికి వస్తాయి.
7. 07/2021 - 5%- 6 నెలల బకాయిలు పీఆర్సీలో కలసి రిటైర్మెంట్ నాటికి వస్తాయి.
8. 01/2022 - ఇప్పటికి 27 నెలల బకాయి ఉంది.
9. 07/2022 - ఇప్పటికి 21 నెలల బకాయి
10. 01/2023- విడుదల చేశారు. మే నెల నుంచి జీతంలో కలుస్తుంది. ఇప్పటికి పాతవి 15 నెలల బకాయి ఉంది.
11. 07/ 2023 - విడుదల చేశారు. మే నెల జీతం నుంచి జీతంలో కలుస్తుంది. ఇప్పటికి పాతవి 15 నెలల బకాయి ఉంది.
12. 01/2024 - విడుదల కాలేదు. ఇప్పటికి మూడు నెలల బకాయి ఉంది.

పై వివరాలు పరిశీలిస్తే..

- 60 నెలల బకాయిలు ట్రెజరీ ఆమోదం పొంది పేమెంట్ కోసం రెండేళ్ల నుంచి ఎదురుచూపులు.
- 36 నెలల బకాయిలు కోవిడ్ పేరు చెప్పి మాయం చేశారు.
- 54 నెలల బకాయిలు పీఆర్సీలో కలిపేసి చెల్లింపులు రిటైర్‌మెంట్‌కి వాయిదా వేశారు.
- 27 నెలల బకాయిలు ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల పెండింగ్‌లో ఉన్నాయి.
- 2003 డీఎస్సీ ఉపాధ్యాయుడు ఈ ఐదేళ్లలో నష్టపోయిన సొమ్ము రూ1.80 లక్షలు.
- 2006 డీఎస్సీ ఉపాధ్యాయుడు ఐదేళ్లలో నష్టపోయిన సొమ్ము రూ. 1.68 లక్షలు.

వేడంగిలో గోగులమ్మ జాతర



పోడూరు, మే 1: వేడంగి గ్రామదేవత శ్రీ గోగులమ్మ జాతర బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి సహస్ర నామార్చనలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆశాదుల ఘటాల నృత్యాలతో బుట్ట బొమ్మలు, కోయడాన్సులతో బాణసంచా కాల్పుల మధ్య గోగులమ్మ అమ్మ వారికి జాతరను నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ బొలిశెట్టి విశ్వేశ్వ రరావు, కార్యదర్శి కోట రామారావు కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మావుళ్ళమ్మను దర్శించుకున్న నటి ఈషా రెబ్బా



భీమవరం టౌన్,మే 1: సినీనటి ఈషా రెబ్బా, దర్శకులు తరుణ్ భాస్కర్ బుధవారం శ్రీమావుళ్ళమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకు లు ప్రత్యేక పూజలను నిర్వహించి ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ మర్యాదలతో వారిని సత్కరించారు. రాజ్ తరుణ్ దర్శకత్వంలో మలయాళం చిత్రం జయ జయ జయహే చిత్రం రిమిక్‌లో ఈషా రెబ్బ నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ రాజమండ్రి, భీమవరం పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. దీనిలో భాగ ంగా మావుళ్ళమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. చెరుకువాడ రంగసాయి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు..



భీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

జిల్లా అంతటా మేడే ర్యాలీలు

ఆచంట/పెనుగొండ/పాలకొల్లు అర్బన్/భీమవరం అర్బన్/భీమవరం క్రైం/భీమవరం రూరల్/పాలకోడేరు/ఆకివీడు/మొగల్తూరు/తాడేపల్లిగూడెం రూరల్, మే 1: మేడే పోరాట స్ఫూర్తితో కార్మిక హక్కులను ఐక్యంగా పరిరక్షించుకోవాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి పిలుపునిచ్చారు. మేడే ను పురస్కరించుకుని బుధవారం ముత్యాలమ్మ చెరువు గట్టు వద్ద గల భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో సంఘం మండల అధ్యక్షుడు పూసల ఏడుకొండలు, సీఐటీయు పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం నుంచి కచేరి సెంటర్ వరకు కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. పెనుగొండలో అంగన్‌వాడీ, ఆశ, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్లో మేడే విశిష్టతను మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ వివరించారు. లారీ స్టాండ్ వద్ద లారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పైలా సింహాచలం పతాకాన్ని ఆవిష్కరించారు. పట్టణంలో ర్యాలీలు జరిపారు. భీమవరంలో సీఐటీయు ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే సభకు వందలాది మంది కార్మికులు లాంచిల రేవులోని సీఐటీయు కార్యాలయం వద్దకు తరలి వచ్చారు. సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కే రాజా రామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఏఐటీయుసీ మున్సిపల్ కార్మికులు ఆధ్వర్యంలో మున్సిపల్ కాలనీ, చెన్నరంగని పాలెం, ఇండస్ట్రియల్ ఏరియాలో ఏఐటీయుసీ జెండాలు ఆవిష్కరించారు. భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌లో రైల్వే కార్మిక సంఘం మేస్త్రీ పి పాండురంగారావు అధ్యక్షతన రైల్వే కూలీలు, హమీలీలు, పారిశుధ్య కార్మికులను సత్కరించారు. టౌన్ స్టేషన్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, ప్రజా నాట్యమండలి కళాకారులు ఎస్‌కె చాన్‌బాషా పాల్గొన్నారు. భీమవరం రూరల్ మండలం వెంప, తోకతిప్ప, కొత్తపూసలమర్రు, దెయ్యాలతిప్ప గ్రామాలలో మేడే జెండా ఆవిష్కరణలు చేశారు. సీపీఎం పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్, మండల నాయకులు రేవు రామకృష్ణ పాల్గొన్నారు. పాలకోడేరులో సీపీఎం నాయకులు, ఆశాకార్యకర్తల నాయకులు, ఆటో కార్మికులు తదితర కార్మికులు ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించి నినాదాలు చేశారు. ఆకివీడులో సీపీఎం, సీఐటీయూ, డీవైఎఫ్ఐ శ్రేణులు, కార్మికులు వాడవాడలో జెండాలుల ఆవిష్కరించి, రాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా మాజీ నాయకులు బి.బలరాం, పెంకి అప్పారావు, కె.తవిటినాయుడు తదితరులు పాన్నారు. మొగల్తూరులో తెలగంశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్మిక పతాకాలు ఆవిష్కరించారు. సిఐటియు కార్యాలయం వద్ద ఆదూరి సాంబమూర్తి, గాంధీబొమ్మల సెంటర్‌లో వీరా పాండురంగారావు సీఐటీయూ పతాకాలు ఆవిష్కరించారు. అనంతరం కార్మికులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, జట్టు కార్మికులు భారీ ప్రదర్శన చేశారు. తాడేపల్లిగూడెంలో ఏఐటీయూసీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ, అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్, సీఐటీయు పట్టణ అధ్యక్షుడు జవ్వాది శ్రీను పాల్గొన్నారు.

భీమరాజు విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో వర్మ, భీమారావు తదితరులు

తణుకు, మే 1: మే డే సందర్భంగా ప్రముఖ కార్మికోద్యమ నేత, మార్క్సిస్టు మేధావి కలిదిండి భీమరాజు విగ్రహాన్ని తణుకు అక్కమాంబ టెక్స్‌టైల్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు డీవీవీ ఎస్ వర్మ ఆవిష్కరించి ప్రసంగించారు. 60 ఏళ్లపాటు తణుకు, తాడేపల్లిగూ డెం, భీమవరం, పెనుగొండలలో భీమరాజు అనేక కార్మిక సంఘాలను నిర్మిం చి, కార్మికులకు విజయాలను సాధించారన్నారు. 'గాంధీజీ హత్య వెనుక, ఇదీ భారతీయం, మోదీ ఎన్నికల రణతంత్రం' వంటి పుస్తకాలను ప్రచురించి మత విద్వేష రాజకీయాల మీద అనేక సభలు నిర్వహించి ప్రజలను చైతన్య పరిచారన్నారు. విగ్రహాన్ని బహూకరించిన డెల్టా పేపర్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వి.వీరభద్రం, టి.శ్రీనివాస్‌లను అభినందించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, ప్రజాస్వామ్య పరిరక్షణకు వేదిక నాయకురాలు సంకు మనోరమ మాట్లాడా రు. విగ్రహ రూపశిల్పి చంద్రశేఖర్, పర్యవేక్షకులు వడ్డి సుబ్బారావులను సత్కరించారు. డి.సోమసుందర్, జి.సీతారామరాజు, డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు, సికిలే పుష్పకుమారి, పి.దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పని చేస్తే జిల్లాలో ఎన్డీఏ క్లీన్‌స్వీప్



సీతారామలక్ష్మిని సన్మానిస్తున్న కొవ్వలి, పొత్తూరి

నరసాపురం టౌన్, మే 1: ఎన్డీఏ కూటమి అభ్యర్థుల్ని గెలిపించేందుకు అందరం సమష్టిగా పని చేస్తే జిల్లాలో క్లీన్‌స్వీప్ చేయడం ఖాయమని పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ జగన్ నవరత్నాల పేరుతో రాష్ట్ర ప్రజల్ని మోసం చేశారన్నారు. వైసీపీ మేనిఫెస్టోలో ఉన్న పథకాలను కొత్తగా చూపించి ఏదో గొప్ప మేనిఫెస్టో అని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వలి నాయుడు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో వైసీపీ ఇంటికి వెళ్ళడం తథ్యమ న్నారు. అనంతరం తోట సీతరామలక్ష్మిని కొవ్వలి ఘనంగా సత్కరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆకివీడు, మే 1: కర్ణాటకకు చెందిన మద్యం ఫుల్ బాటిల్స్ రెండు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. ఏలూరు జిల్లా కైకలూరుకు చెందిన వ్యక్తి కర్ణాటక మద్యం తీసుకొని బుధవారం రాజమండ్రి వెళుతుండగా ఉప్పుటేరు బ్రిడ్జి చెక్‌పోస్టు దగ్గర చెక్ చేయగా రెండు ఫుల్ బాటిల్స్ దొరికాయన్నారు.

హతురాలి మృతదేహంతో తల్లిదండ్రుల ధర్నా

తాడేపల్లిగూడెం రూరల్, మే 1: తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో హత్యకు గురైన లక్కోజు శ్రావణి మృతదేహంతో బుధవారం శ్రావణి తల్లిదండ్రులు, బంధువులు శ్రావణి అత్తింటి వద్ద ధర్నాకు దిగారు. తమ కుమార్తె హత్యకు కారణమైన వారందరినీ శిక్షించాలని, శ్రావణి పిల్లలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో శ్రావణి కుటుంబ సభ్యులతో గ్రామస్థులు చర్చలు జరిపి హంతకులను చట్టం శిక్షిస్తుందని, పిల్లలకు ఆస్తిలో వాటా ఇచ్చేలా ఒప్పందం కుదిర్చారు. దీంతో శ్రావణి బంధువులు ఆందోళన విరమించారు.

నర్సాపురం పార్లమెంట్‌లో స్వీప్ చేస్తాం: వర్మ



తాపీ కార్మికుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నరసాపురం పార్లమెంట్ బీజేపీ ఉమ్మడి అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ

భీమవరం రూరల్, మే 1: నరసాపురం పార్లమెంట్‌లో స్వీప్ చేస్తామని బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం తాపీ కార్మికుల సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలు గెల్చుకుంటామని అన్నారు. గడిచిన ఐదేళ్ళలో రాష్ట్రంలో దోపిడినే జరిగిందన్నారు. మైనింగ్, మద్యం, ఇసుకలలో భారీ దోపిడీ చేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు వేధింపులు, దోపిడీకి అంతం లేదని వివరించారు. కేంద్ర పథకాలను తమవిగా చెప్పుకుంటున్న అవినీతి జగన్ అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు పాలనను జగన్ పాలనను కంపేరిజన్ వేసుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వినాశనకర పనులు కారణంగా అన్ని వ్యవస్థలు నాశనం అయ్యాయన్నారు. ఈ విషయాన్ని ఇవాళ ప్రజలు గ్రహించాలన్నారు. ఒక చేతితో ప్రభుత్వం వంద రూపాయలు ఇచ్చి మరో చేతితో వెయ్యి రూపాయలు లాక్కుంటుందన్నారు. 50 రూపాయలకు అమ్మాల్సిన లిక్కర్ బాటిల్‌ను రూ.200 అమ్మి కల్తీతో కూడిన మద్యం అమ్ముతున్నారని అన్నారు. నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు క్లారిటీ వచ్చింది. బోగస్ ముఖ్యమంత్రి అని అర్థమయింది. పవన్ కల్యాణ్ ఒక చరిష్మా ఆయన 2014లో టికెట్లు, పదవి ఆశించకుండా మద్దతు ఇచ్చారన్నారు. ఇవాళ ఎన్డీయే కూటమి ఏర్పాటు కోసం సీట్లు తగ్గించుకున్నారన్నారు. కూటమి ఏర్పడిందంటే పవన్‌కల్యాణ్ త్యాగాలు ఉన్నాయి. భీమవరం నియోజకవర్గం కూటమి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామన్నారు. ఇసుక ఉచితం, నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామన్నారు. ఐదేళ్ళలో నిర్మాణ రంగం దెబ్బతింది. స్థానిక అధికార పార్టీ నాయకులు దందాతో భీమవరం రియల్ ఎస్టేట్ పతనం అయ్యింది. నిర్మాణాలు నిలిచిపోయాయి. అభివృద్ధి లేదు. పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈకార్యక్రమంలో కోళ్ళ నాగేశ్వరరావు, మోటుపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.





14వ వార్డులో ప్రచారం చేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి.. ఉరదాళ్ళపాలెం ప్రచారంలో కృష్ణతులసి

కూటమి అధికారంలోకి రావడం ఖాయం: ఆరిమిల్లి

తణుకు, మే 1: తణుకు నియోజకవర్గంలో కూటమి అధికారంలోకి రావడం ఖాయమని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం 14వ వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో వైసీపీని బంగాళఖాతంలో కలపడం ఖాయమన్నారు. చంద్రబాబు, పవన్, మోదీ ఆధ్వర్యంలో ప్రజలకు మేలు జరిగేలా ఉమ్మడి మేనిఫెస్టో ఉందన్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా కాపుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఎన్నికల్లో తనకు సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థికి కమలం గుర్తుపై ఓటెయ్యాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, చిట్టూరి సాయిబాబా, స్వర్ణలత, తోట ఆంజనేయులు, రేలంగి శ్రీనివాసరావు, కొమ్మిరెడ్డి శ్రీనివాస రావు, తులసీరామ్, నల్ల భాస్కరరావు పాల్గొన్నారు.

మాట తప్పడం, మడమ తిప్పడమే జగన్ స్టైల్

మాట తప్పడం, మడమ తిప్పడమే జగన్ స్టైల్ అని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణ తులసి అన్నారు. బుధవారం అత్తిలి మండలం ఉరదాళ్ల పాలెంలో కూటమి తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగన్ అధికారంలోకి వచ్చాక హామీలు గాలికొదిలేశారని విమర్శించారు. ఇంటింటికి వెళ్ళి చంద్రబాబు తీసుకొచ్చిన సూపర్ సిక్సు పథకాలు, ఎస్సీ ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్ళకు పింఛన్‌పై వివరించారు. కారుమూరి దత్తత గ్రామం ఉరదాళ్లపాలెం సమస్యల నిలయంగా ఉందని, డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అనాల ఆదినారాయణ, ఆల్తి సత్యానారాయణ, దాసం బాబ్జి, బొబ్బిలి మోహనరావు, శ్రీనివాసు, పూతినీడి శ్రీనివాసు, పోలిశెట్టి చందు, తేజ పాల్గొన్నారు.





విలేకరులతో మాట్లాడుతున్న పితాని సత్యనారాయణ.. పెనుమంట్రలో ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి వర్మ సతీమణి వెంకటేశ్వరి, పితాని కోడళ్లు నాగ స్వాతి, నాగ సాహితి

వలంటీర్లకు మేలు చేస్తాం: పితాని



పెనుగొండలో ప్రచారం చేస్తున్న పితాని తనయుడు భాను, పార్టీ శ్రేణులు

పోడూరు, మే 1: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పార్టీలకు అతీతంగా ప్రజలకు న్యాయబద్ధంగా సేవలందించే వలంటీర్లను కొనసాగించి మేలు చేస్తామని ఆచంట టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ అన్నారు. కొమ్ముచిక్కాలలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు ఇతర అవసరాలకు మళ్ళించకుండా వారికే ఖర్చుపెడతామని, జగన్ ప్రభుత్వం రద్దు చేసిన అన్ని పథకాలను కొనసాగిస్తామన్నారు. బీసీలకు ఆదరణ పథకం ద్వారా గొప్ప మేలు చేస్తామని తెలిపారు.

పెనుగొండ: కూటమి అభ్యర్థులకు అఖండ విజయాన్ని చేకూర్చాలని పితాని సత్యనారా యణ తనయుడు పితాని భాను అన్నారు. బుధవారం పెనుగొండ లోని ఇందిరా శాంతి నగర్, దొంగ గూడెంలో విస్తృతంగా ప్రచారం చేస్తూ సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కేంద్ర ంలో నరేంద్రమోదీ రాష్ట్రంలో చంద్రబాబు పాలనతోనే ప్రజలంతా సుభిక్షంగా జీవనం సాగించగలుగుతారన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు డబుల్ ఇంజన్ రైలు వలే స్పీడ్‌గా ప్రజలందరికి చేరుతాయన్నారు.

పెనుమంత్ర/పెనుగొండ: పెనుమంత్ర గ్రామంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస వర్మ సతీమణి వెంకటేశ్వరి, ఆచంట టీడీపీ అభ్యర్థి పితాని సత్యనారాయణ కోడళ్లు నాగ సాహితి, నాగ స్వాతి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఆక్వారంగాన్ని ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 1.50 పైసలకు విద్యుత్ అందిస్తామన్నారు. పెనుగొండలో జరిగిన కార్యక్రమంలో పితాని తనయుడు భవానీ చందర్ ప్రచారం చేశారు.

మరోసారి జగన్ గెలిస్తే రాష్ట్రం అంధకారమే: నాయకర్



ప్రచారం చేస్తున్న నాయకర్, కొత్తపల్లి

నరసాపురం, మే 1: మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అంధకారంగా మారే ప్రమాదం ఉందని జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. బుధవారం మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారా యుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి, కొవ్వలి నాయుడులతో కలిసి ఆయన పట్టణంలోని 22 వార్డు, మండలంలోని నవరసపురం, వేములదీవి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడిచిన ఐదేళ్ళ నరసాపురంలో అభివృద్ధి ఏమి జరగలేదన్నారు. చామకూరిపాలెంలో పలువురు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. వీరందరికీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

చెరువులో మునిగి బాలుడి దుర్మరణం

ఇరగవరం, మే 1: ఇరగవరం గ్రామ ఊర చెరువులో పడి బాలుడు మృతి చెందాడు. ఇరగవరం ఎస్సై డి. ఆదినారాయణ తెలిపిన వివరాల ప్రకారం గోటేరు గ్రామానికి చెందిన రెడ్డిమిల్లి ప్రసాద్ కుమారుడు రక్షిత రాజు (9), అతని స్నేహితుడు మురాల మహీంద్రతో కలిసి బుధవారం ఇరగవరం పంచాయతీ సమీపాన ఉన్న ఊర చెరువు వద్ద ఆడుకోవడానికి వెళ్లారు. ఆడుకుంటూ చెరువులో ఉన్న తామర పూలు కోసుకునే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో రక్షిత రాజు కాలు జారిపోయి మునిగిపోయాడు. స్నేహితుడిని కాపాడే యత్నంలో మహీంద్ర కూడా మునిగిపోతూ కేకలు వేశాడు. అక్కడ ఉన్న స్థానికులు చెరువు వద్దకు చేరుకుని పొడవాటి కర్రను అందించడంతో మహీంద్ర ఆ కర్రను పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. కర్రను అందిపుచ్చుకోలేని రక్షిత రాజు చెరువులో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లు బాలుడి మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు. బాలుడి మృతితో గోటేరు గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని బాలుడి వెలికితీత ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు.

విద్యతో పాటు సమాజంపై అవగాహన ఉండాలి



పదవ తరగతి విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల

భీమవరం క్రైం, మే 1: విద్యతో పాటు సమాజంపై అవగాహన పెంచుకోవాలని, తల్లితండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభావంతులైన విద్యార్థులను జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తాను కూడా పట్టుదల దీక్షతో ఈస్థితికి వచ్చానని తెలిపారు. జిల్లా అడిషనల్ ఎస్పీ భీమారావు, కాకతీయ విద్యా సంస్థల డైరెక్టర్ కిషోర్, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆకివీడు, మే 1: విద్యుత్ మరమ్మతులు కారణంగా గురువారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ సరఫరా నిలుపుదల చేయబడుతుందని డీఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. భీమవరం మునిసిపాలిటీ, పాలకోడేరు, కాళ్ళ, ఉండి, ఆకివీడు, భీమవరం రూరల్ మండలాలల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతుందన్నారు.

తణుకు: దువ్వ-ఉండి మధ్య టవర్ లైన్ వార్షిక మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈఈ సీహెచ్. రామకృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో సరఫరాకు అంతరాయం కలగవచ్చని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అక్రమ మద్యంపై కఠిన చర్యలు

ఉండి, మే 1:జిల్లాలో అక్రమ మద్యం, బెల్టుషాపులపై ఎక్సైజ్, ఎస్ఈబీ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయని జిల్లా మద్య నిషేధ అబ్కారీ అధికారి ఆర్.గౌరీశ్వరరావు అన్నారు. బుధవారం ఉండిలో ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈఏడాదిలో 887కేసులు నమోదు చేసి 847మందిని అరెస్ట్ చేసి నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రు.41లక్షల66వేల801 రూపాయలు విలువ చేసే 13,223 లీటర్లు మద్యం పట్టుకోవడం జరిగిందన్నారు. అక్రమ మద్యంపై కంట్రోల్ రూం నెంబరు 94914 20699కు తెలియజేయాలని కోరారు.





మేనిఫెస్టో కరపత్రాలను ఆవిష్కరించిన వలవల, బొలిశెట్టి.. ప్రచారం చేస్తున్న సినీ నటుడు పృథ్వీరాజ్

దోచుకోవడమే వైసీపీ ధ్యేయం: బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, మే 1: దోచుకుని దాచుకోవడమే వైసీపీ ధ్యేయమని నియోజకవర్గ జనసేన ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీతో కలసి పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ నాసిరకం మద్యంతో పేదల ప్రాణాలతో సీఎం జగన్ చెలగాట మాడుతున్నారన్నారు. ఐదేళ్లుగా నియోజకవర్గంలో ఎక్కడ చూసినా అవినీతి రాజ్యమేలుతోందని, కే ట్యాక్స్ చెల్లించలేక అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు.

కూటమి మేనిఫెస్టోతో మేలు

కూటమి మేనిఫెస్టో వల్ల ప్రజలందరికీ ఎంతో మేలు జరుగుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో మేనిఫెస్టో కరపత్రాలను ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా మేనిఫెస్టోను రూపకల్పన చేశారని అన్నారు. గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, గంధం సతీష్, పద్మనాభుని మురళి, సబ్నీసు కృష్ణమోహన్, షేక్ బాజి, ఎరుబండి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: పుల్లాయిగూడెం, ఎల్. అగ్రహారం, కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీలో బొలిశెట్టి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వలవల మాట్లాడుతూ ఎన్నికల్లో అబద్ధాల వైసీపీని పారదోలేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

బాహుబలిని ఎదుర్కొనే దమ్ము లేదు

తాడేపల్లిగూడెం అర్బన్: జనసేన బాహుబలిని ఎదుర్కొనే దమ్ము స్థానిక మంత్రి కొట్టు సత్యనారాయణకు లేదని సినీ నటుడు పృథ్వీరాజ్ అన్నారు. బుధవారం పట్టణంలో ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో కొట్టు మూసేసే సమయం ఆసన్నమైందంటూ మంత్రి కొట్టును ఎద్దేవా చేశారు. దేవుడి నిధులు స్వాహా చేసిన వారిని దేవుడే శిక్షిస్తాడన్నారు. టీటీడీలో అవినీతిపై తన వద్ద పూర్తి సమాచారం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ గానే ప్రతి ఒక్కరి చరిత్ర బయట పెడతానన్నారు.

పట్టణాభివృద్ధికి ప్రత్యేక దృష్టి:అంజిబాబు



పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న జనసేన ఉమ్మడి అభ్యర్థి అంజిబాబు

భీమవరం టౌన్, మే 1: పట్టణంలో ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని జనసేన ఉమ్మడి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పట్టణంలోని 17,18,19,20 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వార్డు ప్రజలతో మాట్లాడి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో వార్డుల అభివృద్ధికి కృషి చేశామని అన్నారు. అదే విధంగా ఈ ఎన్నికలల్లో అసెంబ్లీకి గాజుగ్లాసు గుర్తుకు, ఎంపీ అభ్యర్థి శ్రీనివాసవర్మకు కమలం గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఆయనకోరారు.

- అన్ని వర్గాలను సంతృప్తి చేసేలా ఉమ్మడి కూటమి పార్టీల మేనిఫెస్టో ఉందని, భీమవరం నియోజకవర్గంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అంజిబాబు విజయం లక్ష్యంగా పని చేస్తామని రాష్ట్ర చిరంజీవి యువత అధ్యక్షుడు, జనసేన రాష్ట్ర కార్యదర్శి జనసేన పార్టీ భీమవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలికులు పి.భవాని రవికుమార్ అన్నారు. పేదల నుంచి సంపన్నులను చేయడమే లక్ష్యంగా కూటమి పని చేస్తుందని అన్నారు. ఈ ఐదేళ్లకే ఎంతో విధ్వంసం చూశామని, మరో ఐదేళ్ల విధ్వంసం భరించలేమని, కూటమి అభ్యర్థి అంజిబాబు గెలుపుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలనీ అన్నారు. ఉండపల్లి రమేష్ నాయుడు మాట్లాడుతూ భీమవరం అభివృద్ధి అంజిబాబుతోనే సాధ్యమని, ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేసి అంజిబాబు విజయానికి చిత్తశుద్ధితో పని చేద్దామని పిలుపునిచ్చారు.

భీమవరం విచ్చేసిన భవానీకుమార్ ను జనసేన లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉండపల్లి రమేష్ నాయుడు, చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు కోపెల్ల శ్రీనివాస్, ఎన్నికల ప్రచార విభాగం కో ఆర్డినేటర్ రామ లింగేశ్వ రరావు, మెగా ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు చల్లా రాము, కొప్పినీడి బాబీ, లీగల్ సెల్ సుంకర చంద్, జనసేన నాయకులు కలిసి సత్కరించారు.

- భీమవరంలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పులపర్తి రామాంజ నేయులు (అంజిబాబు) గెలుపు కోసం నిరంతరం ప్రచారం నిర్వహిస్తామని గబ్బర్ సింగ్ టీమ్ సభ్యులు అన్నారు. భీమవరం పట్టణంలో జనసేన పార్టీ నాయకుల కొప్పినీడి బాబీ ఆధ్వర్యంలో గబ్బర్ సింగ్ టీమ్ సభ్యులు ఇంటింటికీ తిరిగి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఉమ్మడి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు భీమాల శ్రీరామమూర్తి, చల్లా రాము, మాదాసు బాబీ, పిల్లా నారాయణ మూర్తి, మాదాసు సాయి, యినుకొండ భోగేశ్వ రరావు పాల్గొన్నారు

కూటమికి బ్రాహ్మణులు మద్దతు ఇవ్వాలి

పాలకొల్లు అర్బన్, మే1: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతీ బ్రాహ్మణుడు కృషి చేయాలని పట్టణ బ్రాహ్మణ సంఘ నాయకులు అన్నారు. ఉమ్మడి కూటమి ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టోలో బ్రాహ్మణులకు పెద్ద పీట వేయడం జరిగిందని ఆర్‌బీఎస్ మహిళ మాజీ రాష్ట్ర అధ్యక్షురాలు, టీడీపీ పట్టణ మహిళా కార్యదర్శి పెండ్యాల భవానీ అన్నారు. ఆమె నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. అన్ని వర్గాల కష్టలను నెరవేర్చే విధంగా మేనిఫెస్టో ఉందన్నారు. ఈనెల 2వ తేదీ సాయంత్రం లజపతిరాయ పేటలోని (గణేష్ నగర్) సంఘ నాయకుడు హోతా హరినారాయణ నివాసం వద్ద నియోజక వర్గ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధి కూటమి లక్ష్యం: నిమ్మల



యలమంచిలి మండలంలో ప్రచారం చేస్తున్న టీడీపీ ఉమ్మడి అభ్యర్థి నిమ్మల

యలమంచిలి, మే 1: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రూపొందించిన మేనిఫెస్టోలోని పథకాలు, హామీలతోనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. కలగంపూడి, ఏనుగువానిలంక గ్రామాల్లో నిమ్మల రామానాయుడు బుధవారం ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ సామాజిక పెన్షన్ మొత్తాన్ని రూ.4వేలకు పెంచడమేకాక, కూటమి ప్రభుత్వం జూలై ఒకటో తేదీన ఈ మూడునెలల కాలానికి మూడువేలు కలిపి ఏడువేలు అందిస్తామన్నారు. మేనిఫెస్టోలోని పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. గ్రామాభివృద్ధిని గాలికొదిలేసిన జగన్ ప్రభు త్వాన్ని సాగనంపడా నికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పాలకొల్లులో మేడే సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మల రిక్ష తొక్కి కార్మికులకు సంఘీభావం తెలిపారు.

పాలకొల్లు రూరల్: నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలను తన సొంత కుటుంబంలా ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు భావిస్తారని ఎమ్మెల్యే నిమ్మల భార్య సూర్య కుమారి అన్నారు. బుధవారం పూలపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మరో సారి నిమ్మలను గెలిపిస్తే 5ఏళ్ళపాటు నియోజకవర్గ అభివృద్ధితో పాటు మీ అందరికీ అందుబాటులో ఉంటారని అన్నారు.

హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిదంబరం



చిదంబరాన్ని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

నరసాపురం, మే 1: ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నరసాపురం పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కలిగినీడి చిదంబరం ఎన్నికయ్యారు. గతంలో ఉమ్మడి హైకోర్టు బార్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యులుగా మూడు సార్లు ఎన్నికయ్యారు. బుధవారం అమరావతిలో ఆయన్ను టీడీపీ నాయకులు కలుసుకుని అభినందనలు తెలిపారు.

కూటమిలోనే ముస్లింలకు న్యాయం

ఆకివీడు, మే 1: ముస్లింలకు యాభై ఏళ్ళకే పింఛను పథకం కూటమి ప్రకటించడం గొప్ప అవకాశంగా తాము భావిస్తున్నామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మల్ అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో ముస్లింలకు ఇంత వరకూ ఇటువంటి ఆర్థిక భరోసా కల్పించింది లేదన్నారు. అంతే కాకుండా విదేశి విద్య, ప్రమాద బీమా అద్భుతమైన పథకాలుగా వర్ణించవచ్చునన్నారు.

నోటుకు లొంగని ఓటు రాజకీయం రావాలి

భీమవరం అర్బన్, మే 1: నోటుకు లొంగని ఓటు రాజకీయాన్ని మన రాష్ట్రంలో పరిచయం చేయాలని ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ సుందరామరాజు అన్నారు. రాష్ట్రంలో బీజేపీతో అంటకాగే పార్టీలను ఓడించాలని కోరారు. బుధవారం భీమవరంలోని ఆలిండియ ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. భీమవరం ఉండిలో ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ తరుపున పోటీలో ఉన్న వేటుకురి వెంకట శివరామరాజు, దండు శ్రీనివాసరాజులను గెలిపించాలన్నారు.

రూ.61,700 నగదు స్వాధీనం

పాలకోడేరు, మే 1: గరగపర్రు గ్రామంలోని వసుధా వాత్సల్య కేంద్రం సమీపంలో భీమవరం నుంచి తాడేపల్లిగూడెం బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద ఎటువంటి ఆధారాలు లేని రూ.61700 నగదు ఉందని వాటిని స్వాధీనం చేసుకున్నట్లు మండల ఎన్నికల ఫ్లయింగ్ అధికారి ఎంఎస్ఆర్.ఆంజనేయులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఈయన వెంట ఏఎస్సై మోహనరావు, సిబ్బంది ప్రసాద్, భీమరాజు, కొండబాబు పాల్గొన్నారు.

స్తంభం పైనుంచి పడి కూలీ మృతి

తాడేపల్లిగూడెం రూరల్, మే 1: జార్ఖండ్‌కు చెందిన కూలీలు కొత్తూరులో స్తంభాల లైన్ల పనులు చేస్తుండగా దిల్‌ఖాన్ అబూరి (40) అదుపు తప్పి స్తంభం పైనుంచి కిందపడిపోయాడు. వెంటనే అతన్ని తాడేపల్లిగూడెంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేష్ తెలిపారు.